www.ninadam.in

# నినాదం

తెలుగు దిన పత్రిక

నిఖార్సైన జర్నలిజం

బుధవారం ఏప్రిల్ 29 2026 | ninadam.in

EVENING 6 PM డిజిటల్ ఎడిషన్



గోదావరి నదీ యాజమాన్య మండలి (GRMB) ఛైర్మన్ పి. దోర్జే గ్యాంబా, తెలంగాణ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ కార్యదర్శి ఇ. శ్రీధర్ కూడా పాల్గొన్నారు.

హైదరాబాద్, ఏప్రిల్ 29 (నినాదం) :



రాష్ట్ర డీజీపీగా నియమితులైన సి.వి. ఆనంద్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, నూతన డీజీపీకి అభినందనలు తెలిపారు.

హైదరాబాద్, ఏప్రిల్ 29 (నినాదం) :

# యూపీ అభివృద్ధికి కొత్త జీవనాడి..

**రూ. 36,230 కోట్లతో గంగా ఎక్స్‌ప్రెస్‌వే.. | జాతికి అంకితం చేసిన ప్రధాని మోదీ**

- ఉత్తరప్రదేశ్‌లో గంగా ఎక్స్‌ప్రెస్‌వేను ప్రారంభించిన ప్రధాని మోదీ
- రూ. 36,230 కోట్ల వ్యయంతో 594 కిలోమీటర్ల పొడవున 6 లేన్ల రహదారి నిర్మాణం
- మీరట్-ప్రయాగ్‌రాజ్ మధ్య ప్రయాణ సమయం 12 గంటల నుంచి 6 గంటలకు తగ్గింపు
- యూపీ అభివృద్ధికి ఈ ప్రాజెక్టు కొత్త జీవనాడిగా మారుతుందని ప్రధాని వ్యాఖ్య
- షాజహాన్‌పూర్ జిల్లాలో 3.5 కిలోమీటర్ల ఎమర్జెన్సీ ల్యాండింగ్ స్ట్రిప్ ఏర్పాటు



హర్దోయ్ ఏప్రిల్ 29 (నినాదం) : ఉత్తరప్రదేశ్ అభివృద్ధికి కొత్త జీవనాడిలా మారే గంగా ఎక్స్‌ప్రెస్‌వేను ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ప్రారంభించారు. హర్దోయ్‌లో జరిగిన ఒక బహిరంగ సభలో, సుమారు రూ. 36,230 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును ఆయన జాతికి అంకితం చేశారు. గంగా మాత పరిసర ప్రాంతాల గుండా వెళ్లే ఈ ప్రాజెక్టు ఉత్తరప్రదేశ్ అభివృద్ధికి కొత్త ఊతమిస్తుందని ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ... "గంగామాత ఈ దేశానికి, యూపీకి ఎలా జీవనాడిగా ఉందో, అలాగే ఈ ఎక్స్‌ప్రెస్‌వే కూడా రాష్ట్ర అభివృద్ధికి కొత్త జీవనాడిగా మారుతుంది. ఈ రహదారికి గంగా మాత పేరు పెట్టడం సంతోషంగా ఉంది. ఇది మన అభివృద్ధి దార్శనికతతో పాటు మన గొప్ప వారసత్వాన్ని కూడా ప్రతిబింబిస్తుంది" అని అన్నారు. ఈ ఎక్స్‌ప్రెస్‌వేతో ప్రయాగ్‌రాజ్‌లోని సంగం, కాశీలోని బాబా విశ్వనాథుడి దర్శనం గంటల వ్యవధిలోనే సాధ్యమవుతుందని ఆయన

02

# మమత కోటలో బీజేపీ పాగా వేస్తుందా?..

## ఉత్కంఠగా రెండో విడత పోలింగ్

*పశ్చిమ బెంగాల్‌లో అత్యంత ఉత్కంఠభరితంగా సాగుతున్న రాజకీయ సమరం తుది అంకానికి చేరుకుంది. రాష్ట్రంలోని 294 అసెంబ్లీ స్థానాలకు గాను, రెండో, చివరి విడతలో 142 స్థానాలకు బుధవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), రాష్ట్రంలో తొలిసారిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మధ్య ఈ ఎన్నికలు హోరాహోరీ పోరుగా మారాయి. కాంగ్రెస్, సీపీఐ(ఎం) వంటి పార్టీలు బరిలో ఉన్నప్పటికీ ప్రధాన పోటీ టీఎంసీ, బీజేపీ మధ్యనే నెలకొంది.*



- పశ్చిమ బెంగాల్‌లో రెండో, చివరి విడత అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రారంభం
- తృణమూల్ కంచుకోట అయిన దక్షిణ బెంగాల్‌లోని 142 స్థానాలకు ఎన్నికలు
- భవానీపూర్‌లో సీఎం మమతా బెనర్జీపై బీజేపీ నేత సువేందు అధికారి పోటీ

ఢిల్లీ, ఏప్రిల్ 29 (నినాదం): తొలి విడత పోలింగ్‌లో రికార్డు స్థాయిలో 93.17 శాతం ఓటింగ్ నమోదు కావడంతో రెండో విడతలో కూడా భారీగా ఓటర్లు తరలివస్తున్నారు. ఉదయం నుంచే పలు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. ఏప్రిల్ 23న ఉత్తర బెంగాల్‌లోని 152 నియోజకవర్గాల్లో జరిగిన మొదటి విడత పోలింగ్‌లో నమోదైన అధిక ఓటింగ్ శాతం తమకు అనుకూలమని టీఎంసీ, బీజేపీ రెండు పార్టీలూ ధీమా వ్యక్తం చేస్తున్నాయి. టీఎంసీ కంచుకోటపై బీజేపీ గురి తాజాగా పోలింగ్ జరుగుతున్న దక్షిణ బెంగాల్ ప్రాంతం, గత 15 ఏళ్లుగా తృణమూల్ కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉంది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుచుకున్న 77 స్థానాల్లో కేవలం 18 మాత్రమే ఈ ప్రాంతం నుంచి ఉన్నాయి. కోల్‌కతా, హౌరా, నార్త్, సౌత్ 24 పరగణాలు, నాడియా, హూగ్లీ వంటి కీలక జిల్లాలున్న ఈ ప్రాంతంలో ఆధిక్యం సాధించిన పార్టీయే అధికారాన్ని చేజిక్కించుకుంటుంది. అందుకే, ఈసారి దక్షిణ బెంగాల్‌ను కైవసం చేసుకునేందుకు బీజేపీ తన పూర్తి

02

## మోదీ హైదరాబాద్ సభకు 'జనాగ్రహ సభ'గా నామకరణం

- మే 10న తెలంగాణలో పర్యటించనున్న మోదీ
- సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగసభ




హైదరాబాద్, ఏప్రిల్ 29 (నినాదం) : మే 10వ తేదీన ప్రధాని మోదీ తెలంగాణలో పర్యటంచనున్నారు. కేంద్రంలో మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రధాని తొలిసారిగా తెలంగాణకు

02

## తెలంగాణలో రిటైర్డ్ ఉద్యోగులకు రూ.1,000 కోట్ల బకాయిలు విడుదల

- నిధులు విడుదల చేస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ
- భవిష్యత్తులో చెల్లింపుల ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం




హైదరాబాద్, ఏప్రిల్ 29 (నినాదం) : తెలంగాణ ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగులకు శుభవార్తను అందించింది. వారి బకాయిల కోసం వెయ్యి కోట్ల రూపాయలను విడుదల చేసింది. గత సంవత్సరం అక్టోబర్ వరకు

02



## రేవంత్ రెడ్డికి హరీశ్ రావు బహిరంగ లేఖ

- వరిధాన్యం కుప్పలు తెప్పలుగా వస్తున్నా కొనుగోళ్లు ప్రారంభించలేదని విమర్శ
- సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్

హైదరాబాద్ ఏప్రిల్ 29 (నినాదం) : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వేళ చెప్పిందొకటి, అధికారంలోకి వచ్చాక చేస్తోంది మరొకటని విమర్శించారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ చెప్పిన రైతు డిక్లరేషన్ పెద్ద బోగస్ అని ఆరోపించారు. పంటల కొనుగోళ్లకు

02



## బీజేపీ రిగ్గింగ్‌కు పాల్పడుతోంది

- ఈసీ అధికారులు ఉగ్రవాదుల్లా ప్రవర్తిస్తున్నారు
- భవానీపూర్ నియోజకవర్గంలో తారసపడిన మమతా బెనర్జీ, సువేందు అధికారి
- కేంద్ర బలగాలు కార్యకర్తల ఇళ్లలోకి జొరబడి ఓటర్లను భయపెడుతున్నాయన్న మమతా బెనర్జీ
- బీజేపీ, ఈసీ ప్రజాస్వామ్య పండుగ స్ఫూర్తిని దెబ్బతీస్తున్నారని విమర్శ

02



## "ప్రజా దర్బార్" తో ప్రజల వద్దకే అధికార యంత్రాంగం

- ప్రజా సమస్యలు పరిష్కరించే మానవీయ దృష్టికోణంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం.

- న్యాయబద్ధమైన ప్రతి సమస్యను ప్రణాళిక బద్ధంగా పరిష్కరిస్తాం - మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ఖమ్మం , ఏప్రిల్ 29 (నినాదం) : ప్రజా పాలన -ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈరోజు ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరులో జిల్లా కలెక్టర్, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల జిల్లా అధికారులతో కలిసి "ప్రజా దర్బార్" కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఉదయం కూసుమంచి క్లస్టర్ నుండి వచ్చిన ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని, నేరుగా వారి నుంచి అర్జీలను స్వీకరించి. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత సమయంలోపు వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా మే 4,2026 సోమవారం

02

## మేము చేయని ప్రజా పోరాటం లేదు

- మంత్రి పదవి కావాలని ఎప్పుడూ అడగలేదు
- ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్



హైదరాబాద్, ఏప్రిల్ 29 (నినాదం) : రాష్ట్రంలో టీజేఎస్ పాల్గొనని ప్రజా పోరాటాలు లేవని ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. టీజేఎస్ ఆవిర్భావ దినోత్సవంలో ఆ పార్టీ అధ్యక్షుడు కోదండరాం పాల్గొన్నారు. రాజకీయా వ్యూహాల్లో భాగంగానే కాంగ్రెస్‌కు మద్దతిచ్చాం. మంత్రులం, ఎమ్మెల్యేలం కావాలని మాకు లేదు. మంత్రి పదవి ఇస్తానని కాంగ్రెస్

02




## స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కరెక్షనల్ అడ్మినిస్ట్రేషన్‌లో ఇండక్షన్ శిక్షణను ప్రారంభించిన తెలంగాణ డీజీపీ

హైదరాబాద్, ఏప్రిల్ 29 (నినాదం) : ఢిల్లీ జైళ్ల సిబ్బంది కోసం ఉద్దేశించిన ప్రాథమిక ఇండక్షన్ శిక్షణా కార్యక్రమాన్ని, తెలంగాణ పోలీస్ డైరెక్టర్ జనరల్, ముఖ్య అతిథి బి. శివధర్ రెడ్డి, ఐపీఎస్ చంచల్‌గూడలోని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కరెక్షనల్ అడ్మినిస్ట్రేషన్‌లో ఈరోజు లాంఛనంగా ప్రారంభించారు. ముఖ్య అతిథికి, తెలంగాణ జైళ్లు & దిద్దుబాటు సేవల డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా, SICA సీనియర్ అధికారులు , అధ్యాపక బృందంతో కలిసి ఘన స్వాగతం పలికారు. ఈ ముఖ్యమైన శిక్షణా కార్యక్రమం, దిద్దుబాటు పరిపాలన రంగంలో బలమైన అంతర్రాష్ట్ర సహకారాన్ని ప్రతిబింబిస్తుంది. 2026 సంవత్సరంలో దశలవారీగా శిక్షణ కోసం ఢిల్లీ జైళ్ల

02

# పవన్ కల్యాణ్‌తో నేను బాగానే ఉన్నా..

# అతిగా ప్రవర్తిస్తే సహించేదిలేదు

- అధికారం ఉందని ఇగోలకు పోవద్దు.. సొంత పార్టీ నేతలకు చంద్రబాబు హెచ్చరిక
- జనసేన, బీజేపీతో సమన్వయం అవసరం.. కేంద్రంతో గ్యాప్ రాకూడదని స్పష్టీకరణ
- ఫ్లెక్సీలు, కుర్చీల కోసం గొడవలు పడొద్దని కార్యకర్తలకు హితవు
- త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం



## టీడీపీ నేతలకు చంద్రబాబు వార్నింగ్

మంగళగిరి ఏప్రిల్ 29 (నినాదం) : టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు నాయుడు సొంత పార్టీ నేతలకు, కార్యకర్తలకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. అధికారం వచ్చిందన్న అహంతో ఎవరూ ఇగోలకు పోవద్దని, క్రమశిక్షణ తప్పితే సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. టీడీపీ కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొన్న చంద్రబాబు.. పార్టీ నేతలు, కార్యకర్తల ప్రవర్తనపై కీలక సూచనలు చేస్తూనే, మరోవైపు వైసీపీపై తనదైన శైలిలో విరుచుకుపడ్డారు.

**అతిగా ప్రవర్తిస్తే ప్రజలు హర్షించరు**

"ఈ మధ్య జరిగిన కొన్ని సంఘటనలు నన్ను తీవ్ర మనస్తాపానికి గురి చేశాయి. మనం సుపరిపాలన అనే యజ్ఞం చేస్తుంటే, మన నేతలే సరిగా వ్యవహరించకుంటే బాధ కలుగుతుంది. ప్రజలతో సౌమ్యంగా ఉండాలి, వారికి అందుబాటులో ఉండాలి. నేతలు, కార్యకర్తలు చేసే తప్పులు పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తాయి" అని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్లెక్సీలు, ఫొటోలు, కుర్చీల దగ్గర చిన్నపాటి గొడవలు కూడా రాకూడదని, అతిగా ప్రవర్తిస్తే ప్రజలు హర్షించరని హితవు పలికారు. గత పాలకుల గర్వాన్ని, అహంకారాన్ని చూసే ప్రజలు వారికి బుద్ధి చెప్పారని గుర్తుచేశారు. బూతులు, దాడులు, సెటిల్మెంట్లకు దూరంగా ఉండాలని సూచించారు.

**మిత్రపక్షాలతో సమన్వయం అత్యవసరం**

కూటమి ధర్మాన్ని పాటిస్తూ జనసేన, బీజేపీ నేతలతో సమన్వయంతో ముందుకు సాగాలని చంద్రబాబు స్పష్టం చేశారు. "నేను, పవన్ కల్యాణ్ ఎంతో చక్కగా ఉంటున్నాం. మంచి సంబంధాలు కొనసాగిస్తున్నాం. ఇదే స్ఫూర్తి క్షేత్రస్థాయిలోనూ కనిపించాలి.

02

## తెలంగాణలో పెట్రోల్, డీజిల్ కొరతపై ప్రభుత్వం క్లారిటీ..

- ధరల పెరుగుదల వదంతులతోనే రాష్ట్రంలో ఇంధన కొరత ఏర్పడిందన్న మంత్రి
- అసాధారణ డిమాండ్ కారణంగా బంకుల్లో ఖాళీ అవుతున్న స్టాక్
- సరఫరాను 126 శాతానికి పెంచి పరిస్థితిని చక్కదిద్దుతున్నామన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్, ఏప్రిల్ 29 (నినాదం) : తెలంగాణలో గత మూడు రోజులుగా పలు ప్రాంతాల్లో నెలకొన్న పెట్రోల్, డీజిల్ కొరతపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. ఇంధన ధరలు భారీగా

02

## ఏపీ టెన్త్ ఫలితాలు రేపే..

- ఉదయం 11 గంటలకు ఏపీ పదో తరగతి ఫలితాల విడుదల
- ఫలితాలను ప్రకటించనున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్

02



## తెలంగాణ టెన్త్ ఫలితాలు విడుదల

- మొత్తం 95.1 శాతం ఉత్తీర్ణత
- 96.26 శాతం ఉత్తీర్ణతతో ముందున్న బాలికలు
- ఫలితాల్లో ములుగు జిల్లా ఫస్ట్..హైదరాబాద్ లాస్ట్
- ఫెయిలైన విద్యార్థులకు జూన్ 5 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

హైదరాబాద్, ఏప్రిల్ 29 (నినాదం) : తెలంగాణ పదో తరగతి పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. బుధవారం మధ్యాహ్నం ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు ఫలితాలను విడుదల చేశారు. మొత్తం 95.1 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది 5 లక్షల 28 వేలకు పైగా విద్యార్థులు పదో తరగతి

02

# నినాదం

తెలుగు దిన పత్రిక

నిఖార్సైన జర్నలిజం

EVENING 6PM

02

డిజిటల్ ఎడిషన్

బుధవారం ఏప్రిల్ 29 2026

ninadam.in


## ఏపీ టెన్త్ ఫలితాలు రేపే..

ఏపీలో పదో తరగతి పరీక్ష ఫలితాల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులకు ముఖ్యమైన అప్‌డేట్. పదో తరగతి పరీక్ష ఫలితాలు రేపు (ఏప్రిల్ 30) ఉదయం 11 గంటలకు విడుదల కానున్నాయి. ఈ విషయాన్ని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తన ఎక్స్ ఖాతా ద్వారా అధికారికంగా ప్రకటించారు. ఫలితాలను సులువుగా తెలుసుకునేందుకు ప్రభుత్వం పలు మార్గాలను అందుబాటులోకి తెచ్చింది. విద్యార్థులు తమ ఫలితాలను results.bse.ap.gov.in అనే అధికారిక వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. వీటితో పాటు మనమిత్ర వాట్సాప్ నంబర్ 9552300009కు 'హాయ్' అని సందేశం పంపడం ద్వారా కూడా ఫలితాలను పొందవచ్చని మంత్రి లోకేశ్ తెలిపారు. అలాగే, లీప్ యాప్ ద్వారా కూడా రిజల్ట్స్ తెలుసుకోవచ్చని ఆయన సూచించారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ స్కూల్ లాగిన్ ద్వారా నేరుగా మార్కుల మెమోలను డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం కల్పించారు. ఈ ఏడాది మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు జరిగిన పదో తరగతి పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 6.30 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఫలితాల విడుదల నేపథ్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఉత్కంఠ నెలకొంది.

## యూపీ అభివృద్ధికి కొత్త జీవనాడి..

వివరించారు.

ప్రాజెక్టు ముఖ్యాంశాలు

ఈ గంగా ఎక్స్‌ప్రెస్‌వే 594 కిలోమీటర్ల పొడవైన 6-లేన్ల యాక్సెస్-కంట్రోల్డ్ గ్రీన్‌ఫీల్డ్ హైవే. భవిష్యత్తులో దీనిని 8 లేన్లకు విస్తరించవచ్చు. ఇది ఉత్తరప్రదేశ్‌లోని పశ్చిమ, మధ్య, తూర్పు ప్రాంతాలను కలుపుతూ మీరట్ నుంచి ప్రయాగ్‌రాజ్ వరకు 12 జిల్లాల గుండా వెళుతుంది. దీనివల్ల మీరట్ నుంచి ప్రయాగ్‌రాజ్ మధ్య ప్రస్తుతం 10 నుంచి 12 గంటలుగా ఉన్న ప్రయాణ సమయం కేవలం 6 గంటలకు తగ్గుతుంది.దఈ ప్రాజెక్టులో మరో కీలకమైన అంశం షాజహాన్‌పూర్ జిల్లాలో ఏర్పాటు చేసిన 3.5 కిలోమీటర్ల ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ (ఎయిర్‌స్ట్రిప్). ఇది దేశ రక్షణ సన్నద్ధతకు, వ్యూహాత్మక అవసరాలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ రహదారి వెంట పారిశ్రామిక, లాజిస్టిక్స్ కారిడార్లను అభివృద్ధి చేయనున్నారు. ఇది పరిశ్రమలను ఆకర్షించడం, రైతులకు మెరుగైన మార్కెట్ సౌకర్యం కల్పించడం, పర్యాటకాన్ని ప్రోత్సహించడం, ఉపాధి అవకాశాలను పెంచడం వంటి బహుళ ప్రయోజనాలను అందిస్తుందని అధికారిక ప్రకటనలో తెలిపారు. ఆగ్రా-లక్నో వంటి ఇతర ఎక్స్‌ప్రెస్‌వేలతో ఈ రహదారి అనుసంధానమై, రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుంది.

## మోదీ హైదరాబాద్ సభకు 'జనాగ్రహ సభ'గా నామకరణం

వస్తుండటంతో, దీనిని ఒక చారిత్రాత్మక విజయ సంకేతంగా మలిచేందుకు రాష్ట్ర బీజేపీ సర్వశక్తులూ ఒడ్డుతోంది. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు 'జనాగ్రహ సభ'గా రాష్ట్ర బీజేపీ నేతలు నామకరణం చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, విపక్ష బీఆర్ఎస్ వైఫల్యాలపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను (ఆగ్రహాన్ని) ఓట్లుగా మలుచుకోవాలన్నది బీజేపీ ఉద్దేశ్యం. ఈ సభను రాష్ట్రంలో మునుపెన్నడూ లేని విధంగా నిర్వహించేందుకు బీజేపీ నేతలు సన్నద్ధమవుతున్నారు. సుమారు 3 లక్షల మందిని సభకు తరలించడం ద్వారా అటు కాంగ్రెస్‌కు, ఇటు బీఆర్ఎస్‌కు తమ బలాన్ని చాటాలని భావిస్తున్నారు. మరోవైపు, కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా, జహీరాబాద్ ఇండస్ట్రియల్ కారిడార్, రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ, నేషనల్ హైవేల విస్తరణ వంటి భారీ ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేయడం ద్వారా 'డబుల్ ఇంజిన్ సర్కార్' ఆవశ్యకతను ప్రధాని నొక్కి చెప్పనున్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, హైదరాబాద్, సైబరాబాద్ పరిధిలో పట్టు సాధించేందుకు మోదీ పర్యటనను ఒక గొప్ప అవకాశంగా వాడుకోవాలని కమలనాథులు భావిస్తున్నారు. ముఖ్యంగా మహిళా రిజర్వేషన్ బిల్లు అంశాన్ని ప్రస్తావించడం ద్వారా మహిళా ఓటర్లను ఆకర్షించే అవకాశం ఉంది.

## తెలంగాణలో రిటైర్డ్ ఉద్యోగులకు రూ.1,000 కోట్ల బకాయిలు విడుదల

పెండింగ్‌లో ఉన్న రిటైర్డ్ ఉద్యోగుల జీపీఎఫ్ బకాయిలను క్లియర్ చేసింది. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల చెల్లింపులో జాప్యంపై ఇటీవల హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రూ.1000 కోట్ల నిధులను విడుదల చేస్తూ తెలంగాణ రాష్ట్ర ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రిటైర్డ్ ఉద్యోగుల, జీపీఎఫ్ బకాయిలను ప్రభుత్వం పూర్తిగా క్లియర్ చేసింది. 2025 అక్టోబర్ వరకు ఉన్న అన్ని బకాయిలను ఒకేసారి విడుదల చేసింది. ఈ బకాయిల విడుదలతో పాటు భవిష్యత్తులో చెల్లింపుల ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ప్రతి నెలా చేసే చెల్లింపుల పరిమితిని మరో రూ.1,000 కోట్లకు పెంచుతూ ఆర్థిక శాఖ నిర్ణయం తీసుకుంది. దీనితో ఉద్యోగులకు సంబంధించిన క్లెయిమ్స్, బిల్లులు ఇకపై పెండింగ్‌లో ఉండకుండా ఎప్పటికప్పుడు పరిష్కారమయ్యే వీలుంటుంది.

## స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కరెక్షనల్ అడ్మినిస్ట్రేషన్‌లో ఇండక్షన్ శిక్షణను ప్రారంభించిన తెలంగాణ డీజీపీ

నుండి మొత్తం 381 మంది సిబ్బందిని నామినేట్ చేశారు. ఈరోజు ప్రారంభమైన మొదటి దశ (ఫేజ్-I) బ్యాచ్‌లో 62 మంది శిక్షణార్థులు ఉన్నారు. వీరిలో ఢిల్లీ జైళ్ల శాఖకు చెందిన 61 మంది సిబ్బంది, తెలంగాణ జైళ్ల శాఖకు చెందిన ఒక వార్డర్ ఉన్నారు. ఈ బ్యాచ్‌లో తెలంగాణ నుండి 18 మంది అసిస్టెంట్ సూపరింటెండెంట్లు (15 మంది పురుషులు, 3 మంది మహిళలు), 43 మంది మేట్రన్‌లు/మహిళా వార్డర్లు, , ఒక పురుష వార్డర్ ఉన్నారు. అదనంగా, ఈ కోర్సు సమయంలో అండమాన్ & నికోబార్ దీవుల నుండి ఒక పురుష వార్డర్ చేరతారని భావిస్తున్నారు. ఇది అంతర్-ప్రాంతీయ సహకార స్ఫూర్తిని మరింత బలోపేతం చేస్తుంది. శిక్షణార్థులలో వృత్తిపరమైన సామర్థ్యం, క్రమశిక్షణ, , మానవతా దృక్పథాన్ని పెంపొందించేందుకు ఈ తొమ్మిది నెలల సమగ్ర ఇండక్షన్ శిక్షణా కార్యక్రమాన్ని ఎంతో శ్రద్ధగా రూపొందించారు. ఈ కార్యక్రమంలో ఇండోర్ శిక్షణ (సైద్ధాంతిక పునాది): జైలు పరిపాలన నియమాలు, నేరశాస్త్రం (క్రిమినాలజీ), బాధితుల శాస్త్రం (విక్టిమాలజీ) & శిక్షాశాస్త్రం (పెనాలజీ), మనస్తత్వశాస్త్రం (సైకాలజీ), సామాజిక శాస్త్రం (సోషియాలజీ) & సాంఘిక సేవ (సోషల్ వర్క్), క్రిమినల్ చట్టాలు, రాజ్యాంగ విలువలు & మానవ హక్కులు, , జైలు పరిపాలనలో సాంకేతికత.

**బహిరంగ శిక్షణ (శారీరక, మానసిక దృఢత్వం):**

శారీరక శిక్షణ, BPR&D ప్రమాణాల ప్రకారం పరేడ్, , యోగా & ధ్యానం.

శిక్షణార్థులు SICA యొక్క ఆధునిక, అత్యాధునిక మౌలిక సదుపాయాల నుండి ప్రయోజనం పొందుతారు. ఇందులో సుసజ్జితమైన తరగతి గదులు, ఎయిర్ కండిషన్డ్ ఆడిటోరియం, సుసంపన్నమైన గ్రంథాలయం, దాదాపు 400 మంది శిక్షణార్థులకు హాస్టల్ సౌకర్యాలు, ప్రత్యేక శిక్షణా మైదానాలు, వ్యాయామశాల, , పరిశుభ్రమైన భోజన సౌకర్యాలు ఉన్నాయి. తన ప్రారంభోపన్యాసంలో, తెలంగాణ డీజీపీ బి. శివధర్ రెడ్డి, ఐపీఎస్, సమాజానికి జైళ్ల శాఖ పాత్ర చాలా కీలకమని మరియు అది తేలికైన బాధ్యత కాదని నొక్కి చెప్పారు. జైలు సేవ అనేది కేవలం నాలుగు గోడలకే పరిమితమైన ఉద్యోగం లేదా తాళం-చెవి పనులకు మాత్రమే పరిమితం కాదని, ఖైదీలను సంస్కరించి, తిరిగి సమాజంలోకి చేర్చడంపై కేంద్రీకృతమైన ఒక కీలకమైన విధి అని ఆయన పేర్కొన్నారు. శిక్షణార్థులు అత్యున్నత క్రమశిక్షణ, నిజాయితీ , వృత్తి నైపుణ్య ప్రమాణాలను పాటించాలని, అదే సమయంలో ఖైదీలను గౌరవంగా చూస్తూ వారి పరివర్తనపై దృష్టి పెట్టాలని ఆయన కోరారు. శిక్షణార్థులందరికీ ఈ అర్థవంతమైన , విజయవంతమైన శిక్షణా ప్రయాణం కోసం ఆయన తన శుభాకాంక్షలు తెలియజేశారు. సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ, ఐపీఎస్ అధికారి డాక్టర్ సౌమ్య మిశ్రా, దిద్దుబాటు వ్యవస్థలను బలోపేతం చేయడంలో సంస్థాగత శిక్షణ , అంతర్-రాష్ట్ర సహకారం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ఇండక్షన్ శిక్షణ కోసం ఇంత పెద్ద సంఖ్యలో సిబ్బందిని నియమించడం ద్వారా, ఢిల్లీ జైళ్ల డైరెక్టర్ జనరల్, SICA యొక్క శిక్షణా సామర్థ్యాలపై గట్టి నమ్మకం ఉంచారని ఆమె అంగీకరించారు. ఈ సహకారం, SICA యొక్క శ్రేష్ఠమైన ప్రమాణాలపై , సామర్థ్య నిర్మాణానికి దాని నిబద్ధతపై ఉన్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుందని ఆమె పేర్కొన్నారు. డాక్టర్ మిశ్రా, తిహార్ జైళ్లు , ఇతర ప్రాంతాల సిబ్బందికి ఇచ్చిన శిక్షణతో సహా, SICA గతంలో విజయవంతంగా నిర్వహించిన శిక్షణా కార్యక్రమాలను, అలాగే SICAలో అత్యున్నత ప్రమాణాలతో , సాటిలేని నైపుణ్యంతో నిర్వహించిన BPR&D శిక్షణా కార్యక్రమాలను గుర్తుచేసుకున్నారు. దిద్దుబాటు శిక్షణలో ఈ సంస్థ యొక్క పెరుగుతున్న జాతీయ పాత్రను ఆమె నొక్కిచెప్పారు. ఆధునిక జైలు పరిపాలన పునరావాస , హక్కుల ఆధారిత విధానాలపై ఎక్కువగా దృష్టి సారిస్తోందని నొక్కిచెబుతూ, సంస్కరణ , సానుకూల పరివర్తనకు కారకులుగా తమ బాధ్యతలను స్వీకరించాలని ఆమె శిక్షణార్థులను ప్రోత్సహించారు. శిక్షణలో ఉన్నత ప్రమాణాలను నిలబెట్టడంలో తమ అకడమిక్ పరిజ్ఞానం , క్షేత్రస్థాయి నైపుణ్యంతో కృషి చేస్తున్న SICA అధ్యాపకులు , వనరుల నిపుణుల అంకితభావంతో కూడిన ప్రయత్నాలను కూడా ఈ కార్యక్రమంలో ప్రశంసించారు. ఈ సందర్భంగా, జైలు శాఖ అధికారులు , సిబ్బంది బి. శివధర్ రెడ్డి, ఐపీఎస్ 60వ జన్మదినోత్సవాన్ని ఆయన నాయకత్వా నికి, సేవలకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆత్మీయంగా జరుపుకున్నారు.

## "ప్రజా దర్బార్" తో ప్రజల వద్దకే అధికార యంత్రాంగం

ఖమ్మంలోని ా= గార్డెన్స్ లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే మేగా జాబ్ మేళా పోస్టర్ ని ఆవిష్కరించడం జరిగింది. నిరుద్యోగుల యువత ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాను. ప్రజాప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రజలకు ప్రభుత్వ పథకాలను, సేవలను అందించేందుకు ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక అనే 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రతి శాఖకు సంబంధించిన ప్రజా సమస్యలను అధిగమించేలా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్వయంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి పరిష్కారమార్గం చూపిస్తున్నాం. న్యాయబద్ధమైన ప్రతి సమస్యను ప్రణాళికబద్ధంగా మూడు నెలల వ్యవధిలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నాం. ధరణికి సంబంధించిన సమస్యలను భూభారతి ద్వారా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం. రాష్ట్రంలో మొట్టమొదటి భూభారతి చట్టంలో భాగంగా సర్వే మ్యాప్ తో కూడిన రిజిస్ట్రేషన్ పాలేరు నియోజకవర్గంలో జరగడం చాలా సంతోషం. రానున్న నలభై రోజుల్లో సాదాబైనామాల సమస్యలను పరిష్కరిస్తాం. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా మొక్కజొన్న, వరిధాన్యం పంటలు కనివినీ ఎరుగని రీతిలో దిగుబడులు వచ్చాయి. ప్రభుత్వం వాటిని యుద్ధ ప్రాతిపదిక కొనుగోలు చేయడంతో పాటు, రైతు ఖాతాల్లో ఎప్పటికప్పుడు పైసలు జమ చేస్తోంది. రైతులు మెండుగా వ్యవసాయం చేసుకుంటే ఓర్వలేని తీరుగా వ్యవహరిస్తున్నరు కొందరు. ప్రధాన ప్రతిపక్ష పార్టీ నాయకులు ఉనికి కోల్పోతున్నామని ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని ఉద్దేశంతో కడుపునిండా విషం పెట్టుకొని అబద్ధాలు, అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. అవాకులు చవాకులు పేలుతున్నారు. వాస్తవానికి.. వారు మాట్లాడేదానికి.. చాల తేడా ఉంది. గ్రౌండ్ చూడకుండా గుడ్డిగా మాట్లాడటం ప్రతిపక్షనాయకులకు అలవాటుగా మారింది.

## పవన్ కల్యాణ్‌తో నేను బాగానే ఉన్నా.. అతిగా ప్రవర్తిస్తే సహించేదిలేదు

బీజేపీని కూడా సమన్వయం చేసుకుని వెళ్లాలి. రాష్ట్రానికి, కేంద్రానికి మధ్య గ్యాప్ లేదు, రాకూడదు" అని ఆయన పేర్కొన్నారు. తాను లేకుండా ఎంపీ రాకూడదని ఎమ్మెల్యేలు అనడం సరైన పద్ధతి కాదని, అందరూ మనస్పర్థలు లేకుండా పనిచేయాలని సూచించారు.

**నేరస్థులతో పోరాడుతున్నాం**

ఈ సందర్భంగా వైసీపీ ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "నా రాజకీయ జీవితంలో ఎంతోమంది నేతలతో పోరాడాను. కానీ తొలిసారిగా నేరస్థులతో పోరాడుతున్నాం. సొంత బాబాయి వివేకాను హత్య చేసి ఆ నెపాన్ని మనపై నెట్టారు. తమ కార్యకర్తను కారుతో తొక్కించి ఆ పాపాన్ని కూడా మనకే అంటించారు. కబ్జా చేసిన ఆస్తుల కోసం కడపలో అనుచరుడినే చంపేశారు" అని తీవ్ర ఆరోపణలు చేశారు. వాస్తవాలు బయటపడితే ఎదురుదాడి చేయడం వారికి అలవాటని విమర్శించారు. మనది అభివృద్ధి అయితే వాళ్లది అవినీతి అని, మనది వికాసం అయితే వాళ్లది విధ్వంసమని అన్నారు.

**భవిష్యత్ ఎన్నికలే లక్ష్యం**

రాష్ట్ర పునర్నిర్మాణం కోసం ప్రజలు కూటమికి ఓటేశారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని చంద్రబాబు అన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకపక్షంగా విజయం సాధించాలని పిలుపునిచ్చారు. "మరో మూడేళ్లలో మళ్లీ ఎన్నికలు వస్తాయి. 2024లో వచ్చిన ఓట్ల కంటే ఎక్కువ ఓట్లు సాధించాలి. అప్పుడే మనం బాగా పనిచేసినట్టు. వన్ టైమ్ ఎమ్మెల్యేలుగా ఉండొద్దు, మళ్లీ మళ్లీ గెలవాలి. పనిచేసిన వారికే పదవులు వస్తాయి" అని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేసి పార్టీ ప్రతిష్టను పెంచాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

## కేటీఆర్, హరీశ్ రావుపై కాంగ్రెస్ నేత సంపత్ కుమార్ పరువు నష్టం దావా


- మీడియాలో తమపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్న సంపత్ కుమార్
- తమ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నారని ఆవేదన
- తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరిక



హైదరాబాద్ ఏప్రిల్ 29 (నినాదం) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆ పార్టీ సీనియర్ నేత హరీశ్ రావులపై ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ పరువు నష్టం దావా వేశారు. నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో వారిపై దావా వేశానని ఆయన తెలిపారు. వారు తనపై, కాంగ్రెస్ పార్టీపై తప్పుడు ప్రచారం చేశారని ఆరోపించారు. మూడు నెలల క్రితం జరిగిన చిన్న సంఘటనను ఆధారంగా చేసుకుని తనపై వారు తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు. వారు తమ సొంత మీడియా, సోషల్ మీడియాలో తమపై అసత్య ప్రచారం చేసి, తమ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నారని వాపోయారు. వారు నీచ రాజకీయాలు చేస్తున్నారని, కానీ అలాంటిది సరికాదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై లేదా తనపై తప్పుడు ప్రచారాలు చేయడాన్ని తాము సహించేది లేదని అన్నారు. అందుకే కోర్టుకు వచ్చామని తెలిపారు. ప్రజాప్రతినిధులుగా వారికి చట్టబద్ధంగా విమర్శించే, ప్రశ్నించే హక్కు ఉందని, కానీ ఇష్టారీతిన రాయవద్దని సూచించారు. ఒక కాంట్రాక్టర్ వద్ద తాను రూ.8 కోట్లు అడిగినట్లు బీఆర్ఎస్ అసత్య ప్రచారం చేసిందని సంపత్ కుమార్ మండిపడ్డారు. బీఆర్ఎస్ ఇటువంటి రాజకీయాలు మానుకోవాలని ఆయన హితవు పలికారు. లేదంటే వారు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

## ముందున్నది మండుటెండల కాలం

- మరింత అప్రమత్తంగా ఉండాల్సిందే



హైదరాబాద్, ఏప్రిల్ 29 (నినాదం) : రాష్ట్రంలో భానుడు ప్రచండ భానుడిగా మారాడు. ఎండల ధాటికి ప్రజలు విలవిల్లాడుతున్నారు. బయటకు వస్తే మాడి మసైపోతారా అన్నట్లుగా ఎండలు దంచి కొడుతున్నాయి. మేలో మరింత తీవ్రంగా ఎండలు ఉంటాయని వాతావరణశాఖ హెచ్చరిస్తోంది. రోహిణి కార్తె రాకముందే నిప్పులు కురిపిస్తున్నాడు. అక్కడక్కడా జల్లులు కురుస్తున్నా రాష్ట్రంలో పలుచోట్ల చండప్రచండగా ఎండలు మండుతున్నాయి. దీంతో ఉదయం 9గంటలు దాటిన తర్వాత బయటకు రావాలంటే జనం బెంబేలెత్తి పోతున్నారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో తీవ్రమైన ఎండలు, వడగాలుల ధాటికి ప్రజలు అల్లాడిపోతున్నారు. దీంతో జనసంచారం లేక రహదారులన్నీ కర్ఫ్యూను తలపిస్తున్నది. ఈ మేరకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత ప్రమాదస్థాయికి చేరినట్టు హెచ్చరించింది. అత్యధికంగా నిజామాబాద్ జిల్లా మెండోరాలో 46 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా, 12 జిల్లాల్లో 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయని వెల్లడించింది. 2016 ఏప్రిల్ 26న మంచిర్యాల జిల్లా దండేపల్లిలో నమోదైన 48.8 డిగ్రీల తర్వాత ఈ నెలలో ఇదే అత్యధిక ఉష్ణోగ్రత అని పేర్కొన్నది. దీంతో ఆదిలాబాద్, నిర్మల్, పెద్దపల్లి, జగిత్యాల, కామారెడ్డి, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, నల్లగొండ, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్టు తెలిపింది. వచ్చే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నదని వివరించింది. ప్రజలకు బయటకు వెళ్లే సమయాల్లో తగిన జాగ్రతలు తీసుకోవాలని కోరింది. ఇదిలా ఉండగా, బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో పలు జిల్లాల్లో వర్షాలు కరిసే అవకాశం ఉన్నదని తెలిపింది. ఉష్ణోగ్రతలు గరిష్ఠ స్థాయికి చేరుకోవడంతో ఢిల్లీతో సహా 21 రాష్ట్రాలకు జాతీయ మానవ హకుల కమిషన్ పలు కీలక సూచనలు చేసింది. వృద్ధులు, గర్భిణులు, పిల్లలతోపాటు ఉపాధిహామీ కూలీలపై ఈ ఎండల ప్రభావం అధికంగా ఉంటుందని హెచ్చరించింది. అలాంటి వారి రక్షణకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరింది. 2019 నుంచి 2023 మధ్య కాలంలో వడదెబ్బ వల్ల 3,712 మంది మరణించినట్టు గుర్తుచేసింది. రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే హీట్ యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసి, బలహీనవర్గాలకు మంచినీరు, ఆశ్రయం, వైద్య సహాయం అందించాలని సూచించింది.

## తెలంగాణ టెన్త్ ఫలితాలు విడుదల

పరీక్షలు రాశారు. టెన్త్ ఫలితాల్లో బాలికలదే పైచేయిగా నిలిచింది. బాలికలు 96.26 శాతం ఉత్తీర్ణత సాధించగా.. బాలురు 94.07 శాతం ఉత్తీర్ణత పొందారు. 5,731 స్కూళ్లలో వంద శాతం ఉత్తీర్ణత నమోదవగా.. 6 పాఠశాలల్లో సున్నా శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు విద్యాశాఖ వెల్లడించింది. పదో తరగతి ఫలితాలను 8096958096 అనే మీ సేవా వాట్సాప్ ద్వారా తెలుసుకోవచ్చు. మీ సేవా వాట్సాప్ నెంబర్‌కు విద్యార్థులు హాయ్ అని మెసేజ్ టైప్ చేయాలి. తర్వాత ఎస్ఎస్సి రిజల్ట్స్ అని టైప్ చేసి హాల్ టికెట్ నెంబర్‌ను ఎంటర్ చేస్తే ఫలితాలను చూడొచ్చు. ఇకపోతే సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 99.10 శాతం ఉత్తీర్ణత సాధించారు. తెలుగు మీడియం విద్యార్థుల్లో 89.14 శాతం ఉత్తీర్ణత నమోదయ్యింది. ఇంగ్లీష్ మీడియం విద్యార్థుల్లో 95.86 శాతం ఉత్తీర్ణత నమోదయ్యింది. ఉర్దూ మీడియం విద్యార్థుల్లో 86.71 శాతం నమోదయ్యింది. ములుగు జిల్లాలో అత్యధికంగా 99.30 శాతం ఉత్తీర్ణత సాధించారు. హైదరాబాద్ జిల్లాలో అత్యల్పంగా 89.23 శాతం ఉత్తీర్ణత నమోదయ్యింది. గ్రేడ్స్ మాత్రమే కాకుండా స్జబెక్టుల వారీగా మార్కులను వెల్లడించారు.

**పదో తరగతి ఫెయిలైన విద్యార్థులకు జూన్ 5 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు**

ఫలితాల్లో 95.15 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈ క్రమంలో ఫెయిలైన విద్యార్థుల కోసం ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్‌తో పాటు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ వివరాలను వెల్లడించింది. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 5వ తేదీన ప్రారంభమై జూన్ 12వ తేదీ వరకు కొనసాగుతాయి. ప్రతిరోజు ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలను నిర్వహిస్తారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు రాయాలనుకునే విద్యార్థులు ఏప్రిల్ 30 నుంచి మే 14వ తేదీ వరకు పరీక్ష ఫీజును చెల్లించవచ్చు. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. రీకౌంటింగ్ ఫీజు ఒక సబ్జెక్టుకు రూ.500, రీవెరిఫికేషన్‌కు ఒక సబ్జెక్టుకు రూ.1000 ఫీజు ఉంటుంది.

## మమత కోటలో బీజేపీ పాగా వేస్తుందా?..

రాజకీయ శక్తిని మోహరించింది. ప్రధాని నరేంద్ర మోదీ నుంచి పలు రాష్ట్రాల ముఖ్యమంత్రుల వరకు ఇక్కడ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.

**కీలకమైన పోటీలు.. ఓటర్ల జాబితా వివాదం**

ఈ విడతలో అందరి దృష్టి భవానీపూర్ నియోజకవర్గంపైనే ఉంది. ఇక్కడ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై బీజేపీ అభ్యర్థి సువేందు అధికారి పోటీ చేస్తున్నారు. 2021లో నందిగ్రామ్‌లో మమతను ఓడించిన సువేందు, మరోసారి ఆమెపై పోటీకి దిగడంతో ఇది దేశవ్యాప్తంగా ఆసక్తి రేపుతోంది. మరోవైపు, 64 అసెంబ్లీ స్థానాలున్న నార్త్, సౌత్ 24 పరగణాల జిల్లాలు రెండు పార్టీల రాజకీయ భవిష్యత్తును నిర్దేశిస్తాయని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, ఈ ఎన్నికల్లో ఓటర్ల జాబితా సవరణ (ా×=) అంశం తీవ్ర వివాదాస్పదంగా మారింది. నార్త్ 24 పరగణాలలో 12.6 లక్షలు, సౌత్ 24 పరగణాలలో 10.91 లక్షలు, కోల్‌కతాలో 6.97 లక్షల ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించారు. దాదాపు 25 నియోజకవర్గాల్లో గత ఎన్నికల గెలుపు మార్జిన్ల కంటే తొలగించిన ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉండటంతో, ఇది ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వ వ్యతిరేకత, అవినీతి ఆరోపణలు, పౌరసత్వ రాజకీయాలు టీఎంసీ కంచుకోటను బద్దలు కొడతాయని బీజేపీ ఆశిస్తోంది. మరోవైపు, దక్షిణ బెంగాల్‌పై పట్టు నిలుపుకుని వరుసగా నాలుగోసారి అధికారంలోకి రావాలని మమతా బెనర్జీ విశ్వసిస్తున్నారు. బుధవారం సాయంత్రంతో పోలింగ్ ముగియనుండగా, మే 4న జరిగే ఓట్ల లెక్కింపుతో బెంగాల్ భవిష్యత్ తేలనుంది.

## రేవంత్ రెడ్డికి హరీశ్ రావు బహిరంగ లేఖ

సంబంధించి ఆయన ఈ లేఖను రాశారు. గతంలో తాలు పేరిట తరుగు తీస్తే తోలుతీస్తానన్న సీఎం రేవంత్ రెడ్డి, ఇప్పుడు కేంద్రాల్లోకి వెళ్లి చూడాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలకు వరి ధాన్యం కుప్పలు తెప్పలుగా వస్తున్నా, ఇంకా కొనుగోళ్లు ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. మిల్లుల దగ్గర కూడా బస్తాకు కిలో, రెండు కిలోల తరుగు తీస్తూ రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. ఎండల్లో రైతులు మాడిపోతున్నా ప్రభుత్వానికి సోయిలేదని విమర్శించారు. ఇచ్చిన మాట ప్రకారం, సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. పొద్దుతిరుగుడు రైతుల కష్టాలు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి పట్టదా? అని నిలదీశారు. 20 రోజులుగా కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారని అన్నారు. కేంద్రం కొనుగోలు చేసిన పొద్దుతిరుగుడు పంట పావు వంతు మాత్రమేనని అన్నారు. మిగిలిన 1.20 లక్షల క్వింటాళ్లను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. శనగ రైతుల పాలిట కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు శనిలా మారాయని అన్నారు. అనవసర కారణాలతో కేంద్రాల్లో కొనుగోళ్లు నిలిపివేశారని అన్నారు. శనగలకు మద్దతు ధర రూ.5,875 ఉంటే, ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో ప్రైవేటు వ్యాపారులకు మూడు నాలుగు వేల రూపాయలకే రైతులు అమ్ముకునే దుస్థితి వచ్చిందని అన్నారు. జొన్నల కొనుగోలు కేంద్రాలు ఎప్పుడు ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. కనీస మద్దతు ధర రూ.3,370 ఉంటే ప్రైవేటు వ్యక్తులకు రూ.2,500కు రైతులు అమ్మవలసిన పరిస్థితి వస్తోందని అన్నారు. మొక్కజొన్న కొనుగోలు నిబంధనను సడలించాలని కోరారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని హరీశ్ రావు పేర్కొన్నారు.

## బీజేపీ రిగ్గింగ్‌కు పాల్పడుతోంది

పశ్చిమ బెంగాల్‌లో జరుగుతున్న రెండో దశ పోలింగ్‌లో రిగ్గింగ్ జరుగుతోందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. తాను బరిలో నిలిచిన భవానీపూర్ నియోజకవర్గానికి మమతా బెనర్జీ వెళ్లారు. అదే సమయంలో ఆమెపై పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి సువేందు అధికారి కూడా అక్కడకు వచ్చారు. మమతా బెనర్జీని చూసిన సువేందు "ఆమెను చూడండి. ఈరోజు ఆమెకు ఎవరూ ఓటు వేయడం లేదు" అని వ్యాఖ్యానించారు. దీనితో బీజేపీ, ఎన్నికల సంఘంపై మమతా బెనర్జీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర బలగాలకు చెందిన సభ్యులు తమ పార్టీ కార్యకర్తల ఇళ్లలోకి జొరబడి, ఓటర్లను భయపెడుతున్నారని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో బీజేపీ రిగ్గింగ్‌కు పాల్పడుతోందని మండిపడ్డారు. ఎన్నికల సంఘం ప్రతినిధులు ఉగ్రవాదుల్లా ప్రవర్తిస్తున్నారని ధ్వజమెత్తారు. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తను రాత్రి కొట్టారని, ఇదేం గూండాయిజమని ప్రశ్నించారు. ఓటింగ్ ఇలా జరగకూడదని మమతా బెనర్జీ వ్యాఖ్యానించారు. ఎన్నికలు అంటే ప్రజాస్వామ్య పండుగ అని, కానీ వారు పండుగ స్ఫూర్తిని దెబ్బతీస్తున్నారని విమర్శించారు. మరోవైపు, సువేందు అధికారి కూడా మమతా బెనర్జీపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆమె గూండాలను వెంటేసుకుని తిరుగుతూ ఓటర్లను భయపెడుతున్నారని ఆరోపించారు.

## మేము చేయనిప్రజా పోరాటం లేదు


చెప్పలేదు.. నేను అడగలేదు. అవసరమైనప్పుడు ప్రజలకు తోడుగా ఉన్నాం. మే 12న జరిగే ప్లీనరీలో కీలక నిర్ణయాలు తీసుకుంటాం అని అన్నారు. 'మేము ప్రభుత్వ పదవులు, నామినేటెడ్ పోస్టులు కావాలని అడుగుతున్నాం. ఈసారి మా పార్టీ నేతలకు నామినేటెడ్ పోస్టులు ఇస్తారని నమ్ముతున్నాం' అని అన్నారు. 'గత ప్రభుత్వంలో ఎవరినైనా కలవాలంటే భయపడే పరిస్థితి ఉండేది. ఇంట్లోనే ఫోన్ పెట్టి, జాగ్రత్తగా రమ్మని చెప్పేవాళ్లు. భయం అంటే ఏంటో గత ప్రభుత్వం చూపించింది' అని విమర్శించారు. అమరుల స్ఫూర్తి యాత్రకు కూడా పర్మిషన్ ఇవ్వలేదని కోదండరాం గుర్తు చేశారు. ప్రజల నుంచి దూరంగా ఉంటే ఏ పార్టీ అయినా బతకదని, అందుకే కేసీఆర్ ఇప్పుడు బయటకు వస్తున్నారని అన్నారు. 'మేం సరిగ్గానే ఉన్నాం. ప్రజలే మారాలని కేసీఆర్ ఆలోచిస్తున్నారు' అని వ్యాఖ్యానించారు. కుటుంబ లోపాలను కవిత బయటపెడుతున్నారని అన్నారు. పార్టీ అంటే కుటుంబమే అని కవిత చెప్పకుండానే చెబుతున్నట్లు ఉందని అన్నారు. ఓట్లు, సీట్లు కావాలంటే పార్టీని వేరేలా నడపాలని.. తాము మార్పు కోసమే పార్టీని నడుపుతున్నామని స్పష్టం చేశారు. అన్ని ఎన్నికల్లోనూ పోటీ చేయకుండా ఉండలేమని, ఈసారి కచ్చితంగా ఎన్నికల్లో పోటీ చేస్తామని ప్రకటించారు. ముందు నుంచే నియోజక వర్గాలను ఎంచుకుని పని చేస్తామన్నారు. ప్రభుత్వంలో భాగస్వామ్యం ఉండాలని కోరుకుంటున్నట్లు కోదండరాం తెలిపారు.

## తెలంగాణలో పెట్రోల్, డీజిల్ కొరతపై ప్రభుత్వం క్లారిటీ..

పెరగబోతున్నాయంటూ వ్యాపించిన వదంతుల వల్లే ఈ కృత్రిమ కొరత ఏర్పడిందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ప్రజలు ఆందోళనతో అవసరానికి మించి ఇంధనాన్ని కొనుగోలు చేస్తుండటంతో బంకుల వద్ద భారీ రద్దీ ఏర్పడి, డిమాండ్ అకస్మాత్తుగా పెరిగిందని వివరించారు. ఈ పరిస్థితికి పలు కారణాలు దోహదం చేశాయని ప్రభుత్వం పేర్కొంది. పశ్చిమ బెంగాల్ ఎన్నికల తర్వాత ఇంధన ధరలు పెరుగుతాయనే ప్రచారం ప్రజల్లో ఆందోళన రేకెత్తించింది. దీనికి తోడు పారిశ్రామిక అవసరాలకు వాడే డీజిల్ ధర లీటరుకు రూ.150కి చేరడంతో ఆ వినియోగదారులు కూడా తక్కువ ధరకే లభించే సాధారణ బంకులపై ఆధారపడుతున్నారు. ఇదే సమయంలో ఏపీ, మహారాష్ట్ర వంటి సరిహద్దు రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలు కూడా తెలంగాణలోని బంకుల్లోనే ఇంధనం నింపుతుండటంతో డిమాండ్ అనూహ్యంగా పెరిగింది. దీంతో వచ్చిన సరుకు వచ్చినట్లే అమ్ముడైపోయి, బంకుల వద్ద 'నో స్టాక్' బోర్డులు దర్శనమిచ్చాయి. ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఇంధన సరఫరాను సాధారణం కంటే 126 శాతం పెంచినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. డిమాండ్‌కు అనుగుణంగా సరఫరాను వేగవంతం చేయాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఎం. స్టీఫెన్ రవీంద్ర చమురు కంపెనీలకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 3,100 ట్యాంకర్లను నిరంతర సరఫరా కోసం రంగంలోకి దించారు. ఈ నెల 27వ తేదీ నాటికి రోజువారీ డీజిల్ పంపిణీ 151 శాతం, పెట్రోల్ పంపిణీ 95 శాతానికి పెరిగింది. ప్రస్తుతం పంట కోతలు, ధాన్యం కొనుగోళ్ల సమయం కావడంతో రైతులకు, రవాణా రంగానికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రతి మూడు గంటలకోసారి బంకుల్లోని నిల్వలను సమీక్షిస్తూ, కొరత ఉన్న ప్రాంతాలకు తక్షణమే ట్యాంకర్లను పంపిస్తున్నారు. ప్రజలు వదంతులను నమ్మి ఆందోళన చెందవద్దని, రాష్ట్రంలో ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని ప్రభుత్వం భరోసా ఇచ్చింది.

## మోదీని కలిస్తే బీజేపీలో చేరుతున్నట్లా?

- మీడియా ప్రతినిధుల ప్రశ్నకు మల్లారెడ్డి అసహనం



హైదరాబాద్, ఏప్రిల్ 29 (నినాదం) : "మీరు బీజేపీలో చేరుతున్నారా" అని మీడియా ప్రతినిధి అడిగిన ప్రశ్నకు బీఆర్ఎస్ నాయకుడు, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి తీవ్రంగా స్పందించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిసేందుకు వెళితే బీజేపీలో చేరుతున్నట్లా? అని అసహనం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ యువ నాయకుడు టింకు గౌడ్ ఆధ్వర్యంలో బోయినపల్లిలో జరిగిన పలు సేవా కార్యక్రమాల్లో మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు ఆయనను చుట్టుముట్టి, మీరు ప్రధాని మోదీని కలవడంతో బీజేపీలోకి వెళతారనే హాట్ టాపిక్ నడుస్తోంది కదా, మీరేమంటారని మీడియా ప్రతినిధులు ప్రశ్నించారు. మల్లారెడ్డి స్పందిస్తూ, అది హాట్ టాపిక్ ఏమిటి, ప్రధానిని కలిస్తే బీజేపీలో చేరుతారా, సామాజిక మాధ్యమాల్లో జరిగే ప్రచారానికి తాను స్పందించాల్సిన అవసరం లేదని అన్నారు. బయట జరిగే ప్రచారంతో తనకు సంబంధం లేదని అన్నారు. తాను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నానని స్పష్టం చేశారు.

నినాదం
తెలుగు దిన పత్రిక
నిఖార్సైన జర్నలిజం
EVENING 6 PM
డిజిటల్ ఎడిషన్



## టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నారా లోకేశ్ ప్రమాణస్వీకారం

- నారా లోకేశ్ చేత ప్రమాణస్వీకారం చేయించిన చంద్రబాబు
- ప్రమాణస్వీకారం చేసిన పొలిట్ బ్యూరో, ఇతర కమిటీల నేతలు
- మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమం



**మంగళగిరి ఏప్రిల్ 29 (నినాదం) :** తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా యువనేత, మంత్రి నారా లోకేశ్ ప్రమాణస్వీకారం చేశారు. పార్టీ అధినేత చంద్రబాబు లోకేశ్ చేత ప్రమాణస్వీకారం చేయించారు. లోకేశ్ తో పాటు పొలిట్ బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీలతో కూడా చంద్రబాబు ప్రమాణం చేయించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం వేదికగా ఈ కార్యక్రమం జరిగింది. యువతకు, క్షేత్రస్థాయి కార్యకర్తలకు ప్రాధాన్యతనిస్తూనే, అనుభవజ్ఞులైన నేతలను పొలిట్ బ్యూరోలో కొనసాగించడం ద్వారా 'పాత-కొత్త' కలయికను సమర్థవంతంగా అమలు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మండల, క్లస్టర్ స్థాయి నేతలకు కూడా పొలిట్ బ్యూరోలో చోటు కల్పించడం ద్వారా, సాధారణ కార్యకర్త కూడా ఉన్నత స్థాయికి ఎదగగలడనే బలమైన సంకేతాన్ని పార్టీ పంపింది. ఇకపై ప్రభుత్వంలోనూ, పార్టీలోనూ లోకేశ్ పాత్ర ఇప్పుడు మరింత కీలకం కాబోతోంది. పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేసే బాధ్యతను ఆయనకు అప్పగించినట్లు కనిపిస్తోంది. పదవుల కేటాయింపులో సామాజిక సమీకరణాలను కూడా పరిగణనలోకి తీసుకుని ఈ భారీ కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు.

## వైసీపీ నేత పూడి శ్రీహరి బెంగళూరులో అరెస్ట్

- చంద్రబాబు మార్ఫింగ్ ఫొటోలను పోస్ట్ చేసిన కేసు
- శ్రీహరికి బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించిన సుప్రీంకోర్టు



**బెంగుళూరు, ఏప్రిల్ 29 (నినాదం) :** ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకి సంబంధించిన మార్ఫింగ్ ఫొటోల కేసులో పూడి శ్రీహరిని పోలీసులు అరెస్ట్ చేశారు. బెయిల్ పిటిషన్ పై సుప్రీంకోర్టులో చుక్కెదురైన కొన్ని గంటల వ్యవధిలోనే పోలీసులు ఆయన్ని అదుపులోకి తీసుకోవడం రాజకీయ వర్గాల్లో సంచలనంగా మారింది. వైసీపీ సోషల్ మీడియా ఇన్‌ఛార్జిగా ఉన్న పూడి శ్రీహరిని ఏపీ పోలీసులు బెంగళూరులో అదుపులోకి తీసుకున్నారు. ముఖ్యమంత్రి చేతిలో కత్తి ఉన్నట్లు మార్ఫింగ్ చేసిన పోస్టర్‌ను సోషల్ మీడియాలో షేర్ చేశారన్న ఆరోపణలపై నమోదైన కేసులో భాగంగా ఈ అరెస్ట్ జరిగింది. గతంలో కుప్పం కోర్టు ఆయన రిమాండ్‌ను తిరస్కరించింది. ఆ తర్వాత హైకోర్టు కుప్పం కోర్టు ఉత్తర్వులను సస్పెండ్ చేయడం శ్రీహరికి ఇబ్బందిగా మారింది. అరెస్ట్ నుంచి రక్షణ కోరుతూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించినా ఫలితం దక్కలేదు. బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించిన అత్యున్నత న్యాయస్థానం, ఈ అంశాన్ని హైకోర్టులోనే తేల్చుకోవాలని స్పష్టం చేయడంతో పోలీసులకు మార్గం సుగమమైంది. దీంతో బెంగళూరులో ఉన్న ఆయన్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు ప్రస్తుతం కుప్పంకు తరలిస్తున్నారు.

## "శుభవార్త" అంటూ ఆసక్తికర ట్వీట్ చేసిన రఘురామకృష్ణరాజు

- ఆకివీడు రామాలయం నిర్మాణ వివాదంపై హైకోర్టులో విచారణ
- ఆలయ నిర్మాణం ఆపాలంటూ దాఖలైన పిల్



**అమరావతి, ఏప్రిల్ 29 (నినాదం) :** పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు రామాలయ పునర్నిర్మాణం విషయంలో శుభవార్త అందిందని ఉండి ఎమ్మెల్యే, ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు తెలిపారు. ఆలయ నిర్మాణాన్ని నిలిపివేయాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) హైకోర్టు బుధవారం కొట్టివేసిందని ఆయన సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ఈ పరిణామంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే, ఆకివీడులో రామాలయ నిర్మాణాన్ని ఆపాలని కోరుతూ కొందరు హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం, ఈ పిల్‌ను ముగిస్తున్నట్లు (డిస్పోజ్ ఆఫ్) ఆదేశాలు జారీ చేసింది. ఈ పిల్‌పై ప్రత్యేకంగా విచారణ జరపాల్సిన అవసరం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. హైకోర్టు నిర్ణయంపై స్పందించిన రఘురామ, "ఈరోజు ఉదయం ఏపీ హైకోర్టులో మన ఆకివీడు రామాలయ పునర్నిర్మాణం ఆపాలని దాఖలైన పిల్‌ను డిస్మిస్ చేశారు. మన రామాలయం తరఫున అద్భుతంగా వాదనలు వినిపించిన ప్రముఖ సీనియర్ న్యాయవాది వై.వి. రవి ప్రసాద్ గారికి రామాలయ సమితి తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు" అని పేర్కొన్నారు. హైకోర్టు తాజా ఆదేశాలతో రామాలయ నిర్మాణానికి ఉన్న ఒక అడ్డంకి తొలగిపోయినట్లయింది.

## ఆస్తికోసం కన్నకూతురు ఘాతుకం

- తల్లిదండ్రులు ఉంటున్న ఇంటికి నిప్పు,
- ప్రమాదం నుంచి బయటపడ్డ దంపతులు

**పల్నాడు, ఏప్రిల్ 29 (నినాదం) :** చిలకలూరిపేటలోని గుర్రాల చావిడి ప్రాంతంలో దారుణ ఘటన చోటు చేసుకుంది. ఆస్తి కోసం కూతురు కన్నతల్లిదండ్రుల ఇంటికే నిప్పు పెట్టింది. వారు చనిపోవాలని చూసింది. అదృష్టవశాత్తు వారు ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఆస్తి వివాదం కారణంగా తల్లిదండ్రులపై కూతురు కర్కశంగా వ్యవహరించింది. కన్న తల్లిదండ్రులను కూతురు చంపాలని చూడటం చర్చనీయాంశంగా మారింది. చిలకలూరిపేటకు చెందిన తల్లిదండ్రులు, కూతురికి మధ్య ఆస్తి విషయాల్లో తరచూ గొడవలు జరుతున్నాయి. ఆస్తిని ఇచ్చేందుకు తల్లిదండ్రులు అంగీకరించకపోవ డంతో కోపం పెంచుకున్న కూతురు.. వారి ప్రాణాలు తీయడానికి సిద్ధమైంది. గత రాత్రి తల్లిదండ్రులు ఉంటున్న ఇంటికి కూతురు నిప్పు పెట్టింది. మంటలను గుర్తించిన తల్లిదండ్రులు సకాలంలో ఇంటి నుంచి బయటకు వచ్చేయడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. మంటలు వ్యాపించడంతో



ఇంట్లోని ఫర్నిచర్, ఇతర సామగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కూతురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆస్తి కోసం కన్న తల్లిదండ్రులు ఉంటున్న ఇంటికి కూతురు నిప్పు పెట్టిన ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది.

## దాడులు, హత్యలు పిన్నెల్లి బ్రదర్స్‌కు మామూలే

- మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి కాన్వాయ్‌పై మద్యం బాటిల్‌తో దాడి
- దాడి వెనుక పిన్నెల్లి సోదరుల హస్తం ఉందన్న బ్రహ్మారెడ్డి
- మాచర్ల టీడీపీ బాధ్యుడుగా బాధ్యతలు తీసుకున్నప్పుడే అన్నింటికీ తెగించి వచ్చానన్న బ్రహ్మారెడ్డి



**పల్నాడు ఏప్రిల్ 29 (నినాదం) :** పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలో రాజకీయ వేడి మరోసారి రాజుకుంది. స్థానిక టీడీపీ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి కాన్వాయ్‌పై దాడి జరగడం కలకలం రేపింది. ఈ దాడి వెనుక మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు ఉన్నారని బ్రహ్మారెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. కారంపూడిలోని వెల్దుర్తి క్యాంపు కార్యాలయంలో నిన్న బ్రహ్మారెడ్డి విలేకరులతో మాట్లాడారు. పసర్లపాడు సమీపంలో తన కాన్వాయ్‌పై గుర్తుతెలియని వ్యక్తులు మద్యం బాటిల్‌తో దాడి చేశారని తెలిపారు. ఇది ముమ్మాటికీ పిన్నెల్లి సోదరుల పథకం ప్రకారమే జరిగిందని ఆరోపించారు. చీకట్లో కార్లపై దాడులు చేతకాని వారు చేయించే పని అన్నారు. దాడులు, హత్యలు చేయించడం పిన్నెల్లి సోదరులకు మామూలేనని వ్యాఖ్యానించారు. వారి నీచ రాజకీయాలను ప్రజలు తిప్పికొట్టినా బుద్ధి రాలేదని అన్నారు. వారి మాటలు నమ్మి ఆ పార్టీ కార్యకర్తలు జీవితాలను పణంగా పెట్టొద్దని హితవు పలికారు. శాసనసభ్యుడిపై ఆకతాయిలెవరూ దాడులు చేయలేరన్నారు. "నా 45 ఏళ్ల రాజకీయ జీవితంలో పిన్నెల్లి లాంటి గుంటనక్కలను ఎంతో మందిని చూశా. తాటాకు చప్పుళ్లకు భయపడను," అని బ్రహ్మారెడ్డి వ్యాఖ్యానించారు. మాచర్ల టీడీపీ బాధ్యుడుగా బాధ్యతలు తీసుకున్నప్పుడే అన్నింటికీ తెగించి వచ్చానని జూలకంటి అన్నారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా పని చేశానని చెబుతున్న పిన్నెల్లి .. తాను చేసిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. పిన్నెల్లి సోదరులు చేసిన అరాచకాలు, దోపిడీలు, అవినీతిని బయట పెడతానని పేర్కొన్నారు. పచ్చని పల్లెల్లో చిచ్చుపెడుతూ రాజకీయ కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మాచర్ల నియోజకవర్గంలో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టానని ఆయన వివరించారు.

## తిరుపతికి తగ్గిన విమాన ప్రయాణాలు

### విమాన ధరలతో ప్రయాణజకులక వెనకడుగు

### భక్తులు తగ్గడంతో శ్రీవాణి టిక్కెట్లపై ప్రభావం



**తిరుపతి, ఏప్రిల్ 29 (నినాదం) :** విమాన ప్రయాణ ధరలు తిరులమ భక్తులపై పడింది. గల్ఫ్ యుద్ధంతో భారీగా పెరిగిన విమాన ధరల కారణంగా తిరుపతికి వచ్చే విమాన ప్రయాణికుల సంఖ్య భారీగా తగ్గింది. దీంతో ఈ ప్రభావం శ్రీవాణి టిక్కెట్లపైనా పడింది. తిరుపతి విమానాశ్రయంలో ఒకటిన్నర నెలలుగా శ్రీవాణి ట్రస్టు దాతలకు జారీ చేసే టికెట్లు మిగిలిపోతున్నాయి. రోజూ 40 శాతానికిపైనే టికెట్లు జారీ చేయకుండానే కౌంటర్‌ను మూసివేయాల్సి వస్తోంది. శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం టీటీడీ రోజూ ఆన్‌లైన్ కరెంట్ బుకింగ్ ద్వారా 800, విమానాశ్రయంలో 200 చొప్పున శ్రీవాణి టికెట్లను జారీ చేస్తోంది. ఆన్‌లైన్ కరెంట్ బుకింగ్ ద్వారా ఉదయం తొమ్మిది గంటలకు విడుదల చేసే 800 టికెట్ల కోటా క్షణాల్లో పూర్తవుతుంటే విమానాశ్రయంలో జారీ చేసే 200 టికెట్లలో సగానికిపైగానే మిగిలిపోతున్నాయి. గతంలో రోజూ ఉదయం ఏడు గంటల నుంచి హైదరాబాదు నుంచి తిరుపతికి ఐదు విమాన సర్వీసులు నడిచేవి. ఈక్రమంలో మధ్యాహ్నం 11 గంటలకే 200 టికెట్ల కోటా విక్రయాలు పూర్తయ్యేవి. ఇటీవల యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో ఆయిల్ ధరలు భారీగా పెరిగాయి. విమాన టికెట్ల ధరలు కూడా ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇందులో భాగంగానే ప్రయాణికుల రాకపోకలు చాలావరకు తగ్గిపోయిన క్రమంలో హైదరాబాద్ నుంచి వచ్చే కొన్ని విమాన సర్వీసులను రద్దు చేశారు. సాధారణంగా శ్రీవాణి టికెట్లు కలిగిన భక్తులకు అదేరోజు సాయంత్రం నాలుగు గంటల నుంచి దర్శనం కల్పిస్తారు. ఈక్రమంలో రెండు గంటల ముందు అంటే మధ్యాహ్నం రెండు గంటలకు విమానాశ్రయంలోని కౌంటర్‌ను మూసివేస్తున్న క్రమంలో రోజూ 50 నుంచి 100 టికెట్లు మిగిలిపోతున్నాయి. ఈ నెల ఒకటో తేదీ నుంచి 22వ తేదీ వరకు పరిశీలిస్తే 4,400 టికెట్లు అందుబాటులో ఉంచితే 2,980 విక్రయం కాగా, 1420 మిగిలిపోయాయి. తాజాగా మంగళవారం కూడా 90 టికెట్లు విక్రయం కాగా, 110 టికెట్లు మిగిలిపోయాయి. మామూలుగానే శ్రీవాణి టికెట్లకు విపరీతమైన డిమాండ్ ఉంది. ఈక్రమంలో మిగిలిన టికెట్లను ఆన్‌లైన్ కరెంట్ బుకింగ్ ద్వారా కేటాయిస్తే మిగిలిన భక్తులు వినియోగించుకుంటారని, లేదా తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనాలకు విపరీతమైన ఒత్తిడి నెలకొంటున్న సమయంలో సిఫార్సులపై కేటాయించినా ఈ టికెట్లు వృథా కావనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## రెండేళ్లలో ఉత్తరాంధ్ర ప్రాజెక్టులకు మోక్షం

- ఈ ప్రాజెక్టుల కోసం రూ.2వేల కోట్లు కేటాయించినట్లు వెల్లడి
- వీటి ద్వారా 2.69 లక్షల ఎకరాలకు కొత్తగా సాగునీరు అందుతుందన్న మంత్రి
- నేరడి బ్యారేజీ నిర్మాణానికి అడ్డంకులు తొలగిపోయాయన్న మంత్రి నిమ్మల



**అమరావతి, ఏప్రిల్ 29 (నినాదం) :** ఉత్తరాంధ్ర ప్రాంతంలోని 11 కీలక సాగునీటి ప్రాజెక్టులను రానున్న రెండేళ్లలో పూర్తి చేస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రకటించారు. ఇందుకోసం రూ.2 వేల కోట్లు ఖర్చు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. విజయవాడలోని తన క్యాంపు కార్యాలయం నుంచి నిన్న అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించిన అనంతరం మంత్రి ఈ వివరాలు తెలిపారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే ఉత్తరాంధ్రలో కొత్తగా 2.69 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుండగా, మరో 2.49 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని వివరించారు. కరవు పీడిత ప్రాంతాల్లో తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం చేకూరే ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక కృషితో వంశధార ట్రైబ్యునల్-2021 తీర్పు గెజిట్‌లో ప్రచురితమైందని మంత్రి తెలిపారు. "కేంద్ర మంత్రులు, జలశక్తి అధికారులతో సీఎం తరచూ సంప్రదింపులు జరిపి ఇది సాధించారు. ఫలితంగా శ్రీకాకుళం జిల్లాలో నేరడి బ్యారేజీ నిర్మాణానికి ఉన్న అడ్డంకులు పూర్తిగా తొలగిపోయాయి" అని నిమ్మల పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులపై ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని మంత్రి విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సాగునీటి రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఉత్తరాంధ్ర ప్రజల రుణం తీర్చుకునేలా పనిచేస్తామని స్పష్టం చేశారు.

## ఇంధనాన్ని పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు

- స్టాక్ ఉంచుకుని 'నో స్టాక్' బోర్డులు పెట్టే బంకులపై కఠిన చర్యలకు మంత్రి ఆదేశాలు
- ఆక్వా, వరి రైతులకు ఇంధన కొరత రాకుండా చూడాలన్న మంత్రి నాదెండ్ల మనోహర్
- సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసే వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశాలు



**అమరావతి, ఏప్రిల్ 29 (నినాదం) :** ఇంధనాన్ని పక్కదారి పట్టిస్తూ, కృత్రిమ కొరత సృష్టించే వారిపై ఉక్కుపాదం మోపాలని ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత, అక్రమాలపై మంత్రి నాదెండ్ల అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అక్రమాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఇంధన బంకుల నిర్వహణపై పలు కీలక సూచనలు చేశారు. కొన్ని బంకుల్లో స్టాక్ ఉన్నప్పటికీ 'నో స్టాక్' బోర్డులు పెట్టి వినియోగదా రులను ఇబ్బంది పెడుతున్నారని, అలాంటి యాజమా న్యాలపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇంధన లభ్యతను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం అమలు చేస్తున్న 'రేషన్ పద్ధతి'ని కొనసాగించాలని సూచించారు. ముఖ్యంగా ఆక్వా, వరి రైతులకు వ్యవసాయ పనులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇంధన సరఫరాలో ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. సోషల్ మీడియా వేదికగా ఇంధన కొరతపై తప్పుడు వార్తలు వ్యాప్తి చేస్తూ ప్రజల్లో భయాందోళనలు సృష్టించే వారిని గుర్తించి, వెంటనే కేసులు నమోదు చేయాలని పోలీసు శాఖను ఆదేశించారు. ఇంధనం పోయడానికి నిరాకరిస్తున్న బంకులపై 1967 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిపై జిల్లా అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. గతంతో పోలిస్తే రాష్ట్రంలో బంకుల మూసివేత గణనీయంగా తగ్గిందని, చమురు కంపెనీల నుంచి ఇంధన సరఫరా కూడా మెరుగుపడిందని నాదెండ్ల మనోహర్ తెలిపారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు.

## ఏపీ విద్యుత్ అధికారులకు మంత్రి గొట్టిపాటి కీలక ఆదేశాలు

- వంద రోజుల్లో 6 లక్షల సూర్యఘర్ కనెక్షన్లు పూర్తి చేయాలన్న మంత్రి గొట్టిపాటి



**అమరావతి, ఏప్రిల్ 29 (నినాదం) :** రాష్ట్రంలో పీఎం సూర్యఘర్ పథకం కింద ఎస్సీ, ఎస్టీ వర్గాలకు కేటాయించిన 6 లక్షల కనెక్షన్లను రానున్న వంద రోజుల్లో పూర్తి చేయాలని ఏపీ ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ విద్యుత్ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్దేశించిన లక్ష్యాన్ని గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి గొట్టిపాటి నిన్న విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ భేటీకి సీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి, నెడ్ క్యాప్ వీసీఎండీ కమలాకర్ బాబు, పీఎం సూర్యఘర్ పథకం కాంట్రాక్టర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రతి డిస్కం పరిధిలో రోజుకు కనీసం 2 వేల సూర్యఘర్ కనెక్షన్లు పూర్తి చేసేలా అధికారులు పక్కా కార్యాచరణతో ముందుకు వెళ్లాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుచూపు వల్లే ఈ పథకం రాష్ట్రంలో విజయవంతంగా అమలవుతోందని మంత్రి ప్రశంసించారు. పనుల విషయంలో గుత్తేదారులు ఎలాంటి అలసత్వం ప్రదర్శించినా సహించేది లేదని, నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ఆయన గట్టిగా హెచ్చరించారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ లక్ష్య సాధనకు కృషి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## పెట్రోల్ కొరతపై వైసీపీదే కుట్ర

- పెట్రోల్ కొరతపై వైసీపీ భయాందోళనలు సృష్టిస్తోందన్న మంత్రి పార్థసారధి




**అమరావతి, ఏప్రిల్ 29 (నినాదం) :** రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరతపై ప్రతిపక్ష వైసీపీ భయాందోళనలు సృష్టిస్తోందని ఏపీ సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్రంగా విమర్శించారు. కృష్ణా జిల్లా కారకంపాడులో మాట్లాడిన ఆయన, మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకే కొరత ఉన్న 75 శాతం బంకుల్లో ఇంధన సరఫరా పూర్తి చేశామని, బుధవారానికి పరిస్థితి పూర్తిగా అదుపులోకి వస్తుందని స్పష్టం చేశారు. విశాఖపట్నంలో గూగుల్ వంటి అంతర్జాతీయ సంస్థ శంకుస్థాపన చేస్తుంటే, ఆ అభివృద్ధిని చూసి ఓర్వలేకే వైసీపీ ప్రజల దృష్టిని మళ్లించేందుకు కుట్ర చేస్తోందని మంత్రి ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రానికి రూ. 9 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, దేశంలోని పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వస్తున్నాయని తెలిపారు. ఈ వాస్తవాలు వైసీపీ నేతలకు కనిపించడం లేదా అని ఆయన ప్రశ్నించారు. ప్రతిపక్షం ప్రజల్లో అనవసరమైన ఆందోళన కలిగించడం వల్లే వినియోగదారులు అధికంగా ఇంధనం కొనుగోలు చేస్తున్నారని, ఇదే కృత్రిమ కొరతకు కారణమవుతోందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ సమస్యపై రోజూ సమీక్ష నిర్వహిస్తూ పరిస్థితిని చక్కదిద్దుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వం ఆరు నెలల్లో చెల్లించలేని రైతు బకాయిలను తాము 48 గంటల్లోనే చెల్లించామని మంత్రి గుర్తుచేశారు. రైతాంగ వ్యవస్థలను చిన్నాభిన్నం చేసి, ఇప్పుడు వైసీపీ నేతలు మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు.

## తన దిష్టిబొమ్మను దహనం చేస్తూ గాయపడిన బీజేపీ ఎమ్మెల్యేను పరామర్శించిన అఖిలేశ్ యాదవ్

- రాజకీయాలకు అతీతంగా మానవ సంబంధాలే ముఖ్యమన్న అఖిలేశ్
- ఎమ్మెల్యే ముఖానికి 75 శాతం కాలిన గాయాలయ్యాయన్న వైద్యులు

**లఖ్‌నవూ ఏప్రిల్ 29 (నినాదం) :** లఖ్‌నవూలో ఓ అరుదైన రాజకీయ దృశ్యం చోటుచేసుకుంది. తన దిష్టిబొమ్మను దహనం చేస్తూ తీవ్రంగా గాయపడిన బీజేపీ ఎమ్మెల్యేను సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. రాజకీయాలకు అతీతంగా మానవ సంబంధాలకు విలువనిస్తూ ఆయన తీసుకున్న చొరవ ప్రశంసలు అందుకుంటోంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'నారీ శక్తి



వందన్ అధినియమ్'కు మద్దతుగా ఉత్తరప్రదేశ్‌లోని బహ్రాయిచ్‌లో బీజేపీ నిరసన కార్యక్రమం చేపట్టింది. ఈ క్రమంలో అఖిలేశ్ యాదవ్ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తుండగా మంటలు ఒక్కసారిగా ఎగసిపడి బీజేపీ ఎమ్మెల్యే అనుపమ జైస్వాల్ ముఖానికి అంటుకున్నాయి. ఈ ప్రమాదంలో ఆమె తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ఆమెను లఖ్‌నవూలోని మేదాంత ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న అఖిలేశ్ యాదవ్ మంగళవారం ఆసుపత్రికి వెళ్లి అనుపమను, ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన సోషల్ మీడియాలో స్పందిస్తూ.. "సమాజంలో మాకు విద్వేషాల మంటలు వద్దు, సామరస్యం, సద్భావన కావాలి. రాజకీయాలు వాటి స్థానంలో అవి ఉంటాయి, కానీ మానవ సంబంధాలు కూడా అంతే ముఖ్యం" అని పేర్కొన్నారు. అఖిలేశ్ రాకను అనుపమ భర్త అశోక్ జైస్వాల్ ప్రశంసించారు. ఇది ప్రజాస్వామ్య మర్యాదకు, మానవతా సున్నితత్వానికి నిదర్శనమని కొనియాడారు. మరోవైపు, ఉత్తరప్రదేశ్ ఉప ముఖ్యమంత్రులు బ్రజేశ్ పాఠక్, కేశవ్ ప్రసాద్ మౌర్య కూడా ఆసుపత్రికి వెళ్లి అనుపమను పరామర్శించారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఫోన్‌లో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం అనుపమ ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. ఆమె ముఖంపై 75 శాతం, చెవి, నుదుటి భాగంలో 60 శాతం కాలిన గాయాలయ్యాయని, కంటికి కూడా పాక్షికంగా గాయమైనట్టు వైద్యులు తెలిపారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నట్టు వారు వెల్లడించారు.

## రైతులకు ఇబ్బందులు కల్గకుండా కొనుగోళ్లు చేపట్టాలి

### - భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



**భూపాలపల్లి ప్రతినిధి,ఏప్రిల్ 29(నినాదం ):** రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రం ద్వారా ధాన్యం కొనుగోలు చేపట్టాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. బుధవారం భూపాలపల్లి నియోజకవర్గంలోని మోరంచపల్లి, గణపురం మండలంలోని కర్కపల్లి, గాంధీనగర్, మైలారం గ్రామాలలో పీఏసిఎస్, ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం రైతులు పండించిన సన్న ధాన్యానికి మద్దతు ధర రూ. 2389తో పాటుగా బోనస్ రూ. 500 ఇస్తుందని తెలిపారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ పంటను నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి విక్రయించాలని తెలిపారు. మధ్యవర్తి జోక్యం లేకుండా పారద ర్శకంగా ధాన్యం కొనుగోలు జరుగుతుందని రైతులకు సమయానికి డబ్బులు చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తేమ ప్రమాణాలు, కొలతలు సక్రమంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. రైతులు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్న వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని ప్రభుత్వం రైతు సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు కోత మిషన్ల యొక్క ఆర్పిఎం 18 నుండి 20 వరకు మరియు బ్లోయర్ ఆన్ లో ఉంచే విధంగా కోత మిషన్ యజమానులకు తెలియజేయాలని సూచించారు. దీని ద్వారా ధాన్యంలో తాలు ఉండదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై, వ్యవసాయ శాఖ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నినాదం
తెలుగు దిన పత్రిక
నిఖార్సైన జర్నలిజం
EVENING 6 PM
డిజిటల్ ఎడిషన్
బుధవారం ఏప్రిల్ 29 2026
ninadam.in


# బీఆర్ఎస్ ఎన్నారై కమిటీలన్నీ రద్దు

- పార్టీని క్షేత్రస్థాయి నుంచి ప్రక్షాళన చేసే దిశగా కేసీఆర్
- సభ్యత్వాల నమోదు తర్వాత కొత్త కమిటీల నియామకం



**హైదరాబాద్ ఏప్రిల్ 29 (నినాదం) :** బీఆర్ఎస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి ప్రక్షాళన చేయాలన్న అధినేత కేసీఆర్ వ్యూహంలో భాగంగా ఇప్పుడు ఎన్నారై విభాగంలో కూడా పెను మార్పులు చోటుచేసుకున్నాయి. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో సుదీర్ఘంగా చర్చించిన అనంతరం, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని బీఆర్ఎస్ ఎన్నారై కమిటీలను రద్దు చేస్తున్నట్లు పార్టీ గ్లోబల్ కో-ఆర్డినేటర్ మహేశ్ బిగాల ప్రకటించారు. పార్టీని మరింత పకడ్బందీగా, పద్ధతిగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతోనే ఈ రద్దు నిర్ణయం తీసుకున్నారు. పాత కమిటీల స్థానంలో కొత్త రక్తంతో, మరింత ఉత్సాహంగా పనిచేసేలా విభాగాలను పునర్నిర్మిస్తున్నారు. త్వరలోనే విదేశాల్లో ఉన్న పార్టీ మద్దతుదారుల కోసం 'సమగ్ర సభ్యత్వ నమోదు' కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈ సభ్యత్వ నమోదు ప్రక్రియ పూర్తయిన తర్వాతే, కొత్త నిబంధనల ప్రకారం కొత్త కమిటీలను నియమిస్తారు. ఈ పరివర్తన సమయంలో ఎన్నారై సభ్యులు, మద్దతుదారులు సంయమనంతో ఉండి పార్టీ నాయకత్వానికి సహకరించాలని మహేశ్ బిగాల కోరారు.


# కవిత పార్టీ పెట్టడానికి ఇంటి గొడవలే కారణం

\- దానం నాగేందర్



**హైదరాబాద్ ఏప్రిల్ 29 (నినాదం) :** టీఆర్ఎస్ (తెలంగాణ రాష్ట్ర సేన) అధినేత్రి కల్వకుంట్ల కవితపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. కవిత కొత్త పార్టీ పెట్టడం వెనుక రాజకీయ కారణాల కంటే ఆమె 'ఇంటి గొడవలే' ప్రధాన కారణమని ఆయన అన్నారు. కవిత తన కన్నతండ్రిని (కేసీఆర్) ఒక రోబోలా అభివర్ణించడాన్ని దానం నాగేందర్ తప్పుబట్టారు. కుటుంబ సభ్యుల మధ్య ఉన్న విభేదాల వల్లే ఆమె కొత్త రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించారని చెప్పారు. రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తోందని ఆమె చేస్తున్న విమర్శల్లో వాస్తవం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోని తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువవుతున్నాయని ఆయన అన్నారు. ప్రజా సంక్షేమం గురించి మాట్లాడుతూ, త్వరలోనే ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయబోతున్నట్లు ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లతో పాటు పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## తెలంగాణ సచివాలయంలో నకిలీ పోలీస్ హల్‌చల్.. సీఎంను కల్పిస్తానంటూ వీడియోలు!



**హైదరాబాద్ ఏప్రిల్ 29 (నినాదం) :** తెలంగాణ సచివాలయంలో భద్రతా లోపం మరోసారి బట్టబయలైంది. నిఖిల్ అనే వ్యక్తి పోలీస్ అధికారిగా నటిస్తూ, ఏకంగా సచివాలయంలోకి ప్రవేశించి వీడియోలు చేయడం తీవ్ర కలకలం రేపుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కల్పిస్తానని, ఐపీఎల్ టికెట్లు ఇప్పిస్తానని చెబుతూ అతను చిత్రీకరించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. విషయం పోలీసుల దృష్టికి వెళ్లడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. నిఖిల్ అసలు పోలీసే కాదని, సోషల్ మీడియా రీల్స్ కోసం పాతబస్తీలో పోలీస్ యూనిఫాం కొనుగోలు చేసి ఈ మోసానికి పాల్పడ్డాడని విచారణలో తేలింది. ఈ వీడియోలు వైరల్ కావడంతో పోలీసులు అప్రమత్తమై నిఖిల్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడిపై ఆంధ్రప్రదేశ్‌లోని పలు పోలీస్ స్టేషన్లలో ఇప్పటికే చీటింగ్ కేసులు నమోదైనట్లు సమాచారం. ఈ ఘటనతో సచివాలయ భద్రతా వ్యవస్థ, నిఘా వర్గాల పనితీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అత్యంత పటిష్ఠమైన భద్రత ఉండాల్సిన ప్రదేశంలో నకిలీ వ్యక్తి వీడియోలు తీసేంత వరకు గుర్తించకపోవడంపై పలువురు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇలా నకిలీ గుర్తింపు కార్డులతో డజనుకు పైగా వ్యక్తులు సచివాలయంలోకి ప్రవేశించినట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఈ తాజా ఘటన ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారింది. ప్రస్తుతం పోలీసులు నిఖిల్‌ను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు.

# పాత రైళ్లు ఏమైపోతాయి?..

## రిటైర్మెంట్ తర్వాత వాటిని ఏం చేస్తారో తెలుసా?

- రైళ్లకు నిర్ణీత జీవితకాలం.. ఆ తర్వాత వాటికి రిటైర్మెంట్
- పాత ప్యాసింజర్ కోచ్‌లు గూడ్స్ బోగీలుగా మార్పు
- కార్లు, ట్రాక్టర్ల రవాణాకు ఎన్ఎంజీ కోచ్‌ల వినియోగం
- మిషన్ జీరో స్క్రాప్‌లో వేల సంఖ్యలో కోచ్‌లు, ఇంజిన్ల తొలగింపు
- పనిచేయని రైళ్లను తుక్కుగా మార్చి విడిభాగాల అమ్మకం



**హైదరాబాద్ ఏప్రిల్ 29 (నినాదం) :** వేగంగా దూసుకెళ్తున్న రైలును చూసినప్పుడు, దాని జీవితకాలం ముగిశాక ఏమవుతుందనే ఆలోచన ఎప్పుడైనా వచ్చిందా? ప్రపంచంలోని అతిపెద్ద రైల్వే నెట్‌వర్క్‌లలో ఒకటైన భారతీయ రైల్వేలో, కాలం చెల్లిన రైళ్ల కథ మనం ఊహించిన దానికంటే చాలా ఆసక్తికరంగా ఉంటుంది. అవి కేవలం మాయం కావు. రిటైర్మెంట్ తర్వాత రూపు మార్చుకుంటాయి, కొన్నిసార్లు తుక్కుగా మారిన తర్వాత కూడా రైల్వేకు ఆదాయాన్ని తెచ్చిపెడతాయి.

**రైళ్లకు రిటైర్మెంట్.. కొత్త జీవితం**

మనుషుల్లాగే రైళ్లకు కూడా నిర్దిష్ట జీవితకాలం ఉంటుంది. ఉదాహరణకు పాత తరం ఐసీఎఫ్ ప్యాసింజర్ కోచ్‌లు 25-30 ఏళ్లు, ఆధునిక ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు 35 ఏళ్ల వరకు సేవలందిస్తాయి. కేవలం వయసు పైబడటమే కాదు, భద్రతా ప్రమాణాలు తగ్గినా, మరమ్మతుల ఖర్చు పెరిగినా, లేదా సాంకేతికంగా వెనుకబడినా రైళ్లను సేవల నుంచి తొలగిస్తారు. అయితే, రిటైర్మెంట్ అంటే వెంటనే తుక్కుగా మార్చడం కాదు. చాలా రైళ్లకు రెండో జీవితం లభిస్తుంది. పాత ప్యాసింజర్ కోచ్‌లను 'న్యూ మోడిఫైడ్ గూడ్సు (ఎన్ఎంజీ) కోచ్‌లుగా మారుస్తారు. ఈ ప్రక్రియలో కోచ్‌లోని సీట్లు, ఫ్యాన్లు, లైట్లు వంటివి తొలగించి, కిటికీలను పూర్తిగా మూసివేస్తారు. కోచ్ బాడీని లోహంతో బలోపేతం చేసి, సరకు రవాణాకు అనువుగా తయారుచేస్తారు. వీటిని కార్లు, ట్రాక్టర్లు, మినీ ట్రక్కుల రవాణాకు వాడతారు. ఈ కొత్త రూపంలో అవి మరో 5 నుంచి 10 ఏళ్ల వరకు పనిచేస్తాయి.

**తుది దశ.. తుక్కుగా మార్చడం**

'మిషన్ జీరో స్క్రాప్', విద్యుదీకరణ ప్రణాళికల్లో భాగంగా భారతీయ రైల్వే ఇటీవల భారీగా మార్పులు చేపట్టింది. పాత డీజిల్ ఇంజిన్ల స్థానంలో ఎలక్ట్రిక్ ఇంజిన్లు, పాత కోచ్‌ల స్థానంలో ఆధునిక ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను ప్రవేశపెట్టింది. ఈ క్రమంలో కేవలం 2020 నుంచి 2024 మధ్య కాలంలోనే 1,000కి పైగా ఇంజిన్లు, 37,000కు పైగా కోచ్‌లు, వ్యాగన్లను సేవల నుంచి తొలగించారు. ఇలా పూర్తిగా పనిచేయదని నిర్ధారించిన రైలును తుక్కుగా మార్చే ప్రక్రియ మొదలవుతుంది. రైలును విడిభాగాలుగా విడదీసి, ఇనుము, ఉక్కు వంటి ఫెర్రస్ లోహాలు, రాగి, అల్యూమినియం, ఇత్తడి వంటి నాన్-ఫెర్రస్ లోహాలను వేరు చేస్తారు. వీటితో పాటు సీట్లు, ఏసీలు, లైట్లు, బ్యాటరీల వంటి చిన్న భాగాలను కూడా వేరు చేసి, పునర్వినియోగానికి లేదా రీసైక్లింగ్‌కు పంపుతారు. ఈ స్క్రాప్‌ను అమ్మడం ద్వారా రైల్వే శాఖకు భారీ ఆదాయం సమకూరుతుంది. ఈ విధంగా ఒక రైలు జీవితం మనం ఊహించిన దానికంటే చాలా ఎక్కువ కాలం ఉంటుంది. ప్రయాణికులకు సేవ చేయడంతో మొదలై, చివరికి సరకు రవాణా, తుక్కు రూపంలోనూ తన సేవలను కొనసాగిస్తూనే ఉంటుంది.

# సోనమ్‌కు బెయిల్‌పై సవాల్

- మేఘాలయ హైకోర్టులో సవాల్ చేయాలని నిర్ణయం



**భోపాల్, ఏప్రిల్ 29 (నినాదం) :** సంచలనం సృష్టించిన మేఘాలయ హనీమూన్ హత్య కేసులో నిందితురాలు సోనమ్‌కి బెయిల్ ఇవ్వడంపై సవాల్ చేయాలని రఘువంశీ కుటుంబం నిర్ణయించింది. సోనమ్‌కు బెయిల్ రావడంపై రాజా రఘువంశీ కుటుంబం ఆశ్చర్యపోయింది. దీనిపై మేఘాలయ హైకోర్టును ఆశ్రయించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. సోనమ్ అరెస్టు సమయంలో పోలీసులు చేసిన తప్పిదం వల్లే ఆమెకు బెయిల్ మంజూరైనట్లు తాజాగా బయటకొచ్చింది. దీనిపై బాధిత రఘువంశీ కుటుంబం మేఘాలయ హైకోర్టును ఆశ్రయించేందుకు సన్నద్ధమవుతుంది. భారతీయ న్యాయ సంహిత ప్రకారం.. హత్యకు సంబంధించి నిందితులపై 103(1) సెక్షన్ విధించాలి. కానీ ఈ హనీమూన్ హత్య కేసుకు సంబంధించి సోనమ్ అరెస్టు మెమోలో సెక్షన్ 403(1) అని ప్రస్తావించారు. బీఎన్ఎస్‌లో ఇలాంటి సెక్షనే లేదు. సాంకేతిక తప్పిదం వల్ల ఇలా జరిగిందని పోలీసులు పేర్కొన్నారు. అయితే, అరెస్టు మెమోలోనే కాకుండా.. కేసుకు సంబంధించిన అన్ని పత్రాల్లోనూ ఇదే సెక్షన్ ప్రస్తావించ డాన్ని మేఘాలయ కోర్టు గుర్తించింది. సాంకేతిక తప్పిదమనే పోలీసుల వాదనలను తిరస్కరించింది. ఈ క్రమంలో సోనమ్ అరెస్టుకి సరైన కారణాలు లేవని పేర్కొంది. దీంతోపాటు సోనమ్‌ను అరెస్టు చేసి తొలిసారి గాజీపూర్‌లోని కోర్టులో హాజరుపరిచినప్పుడు.. న్యాయవాదిని కలిసేందుకు ఆమెకు అనుమతులు ఇచ్చినట్లు రికార్డుల్లో ఎక్కడా లేదని కోర్టు పేర్కొంది. దీని కారణంగా ఆమె మొదట్లోనే తన అరెస్టును సవాల్ చేయలేక పోయిందని గుర్తించింది. ఈ లోపాల వల్ల సోనమ్‌కు బెయిల్ మంజూరుచేస్తున్నట్లు న్యాయస్థానం తీర్పునిచ్చింది. అయితే, అనుమతులు లేకుండా సోనమ్ షిల్లాంగ్ జిల్లాను విడిచివెళ్లకూడదన్న షరతు విధించింది. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన రాజా రఘువంశీ కుటుంబం ట్రాన్స్‌పోర్టు వ్యాపారం చేస్తోంది. గతేడాది మే 11న అతడికి సోనమ్ తో వివాహం జరగ్గా.. 20న హనీమూన్ కోసం ఈ నవ దంపతులు మేఘాలయకు వెళ్లారు. ఆ తర్వాత వీరు కన్పించకుండాపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళనకు గురై పోలీసులను ఆశ్రయించారు. ఈ క్రమంలోనే అదృశ్యమైన 11 రోజుల తర్వాత రాజా రఘువంశీ మృతదేహాన్ని సోహ్రాలోని ఓ జలపాతం సమీపంలో లోతైన లోయలో పోలీసులు గుర్తించారు. అతడి శరీరంపై కత్తి గాయాలు ఉండటంతో పోలీసులు హత్యగా అనుమానించారు. అనంతరం సోనమ్ కోసం గాలించగా.. ఉన్నట్టుండి జూన్ 7న ఆమె ఉత్తరప్రదేశ్‌లోని గాజీపూర్‌లో ప్రత్యక్షమైంది. ప్రియుడితో కలిసి ఆమే భర్తను హత్య చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. దీంతో పోలీసులు ఆమెను అరెస్టు చేశారు. ఆమెకు సహకరించిన ప్రియుడు రాజ్ కుశ్వాహాతో సహా మొత్తం ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. అయితే, వీరిలో ముగ్గురికి ఇప్పటికే బెయిల్ లభించింది.

## పదో తరగతి ఫలితాల వేళ

# విద్యార్థులకు అండగా నిలవండి

\- జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా



**వికారాబాద్, ఏప్రిల్ 29(నినాదం ):** నేడు పదో తరగతి ఫలితాలు విడుదలవుతున్న తరుణంలో విద్యార్థుల తల్లిదండ్రులు అత్యంత సంయమనంతో వ్యవహరించాలని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ్ మెహ్రా ఐ పీ ఎస్ కోరారు. ఫలితం ఏదైనా సరే, పిల్లలను ప్రేమతో అక్కున చేర్చుకోవాలని, మార్కులు తక్కువ వచ్చాయని లేదా ఫెయిల్ అయ్యారని వారిని దండించడం, నిందించడం వంటివి చేయవద్దని కోరారు. పదేళ్ల విద్యా ప్రయాణంలో ఇదొక చిన్న మలుపు మాత్రమేనని, జీవితానికి ఇది చివరి పరీక్ష కాదని తల్లిదండ్రులు గుర్తించాలని ఎస్పీ పేర్కొన్నారు. తోటి పిల్లలతో పోల్చి వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయకుండా, వారికి భరోసానిస్తూ భవిష్యత్తుపై ధైర్యం కల్పించాల్సిన బాధ్యత పెద్దలందరిపై ఉందని ఆమె గుర్తు చేశారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు ఒత్తిడికి లోనయ్యే అవకాశం ఉన్నందున, వారి ప్రవర్తనను గమనిస్తూ స్నేహపూర్వకంగా ఉండాలని ఎస్పీ సూచించారు. ఒకవేళ ఆశించిన ఫలితాలు రాకపోతే, కుంగిపోకుండా తిరిగి ప్రయత్నించేలా పిల్లలను ప్రోత్సహించాలని, ఓటమి గెలుపుకు తొలిమెట్టుఅనే విషయాన్ని వారికి అర్థమయ్యేలా చెప్పాలని కోరారు. ఫలితాల ప్రభావంతో పిల్లలు ఎలాంటి అనాలోచిత నిర్ణయాలు తీసుకోకుండా కుటుంబ సభ్యులు అండగా ఉండాలని, జిల్లా పోలీస్ యంత్రాంగం ఎప్పుడూ విద్యార్థుల భవిష్యత్తు కోసం తోడ్పాటునందిస్తుందని ఆమె తెలిపారు. విద్యార్థులు ధైర్యంగా ఉండి, తమ లక్ష్యాల దిశగా ముందడుగు వేయాలని ఎస్పీ ఆకాంక్షించారు.

# హైదరాబాదులో పాస్ పోర్ట్ మెగా మేళా...

- పాస్‌పోర్ట్ దరఖాస్తుదారుల కోసం మే 9న ప్రత్యేక మేళా
- హైదరాబాద్ రీజియన్‌లో 4,000 అదనపు స్లాట్ల విడుదల



**హైదరాబాద్ ఏప్రిల్ 29 (నినాదం) :** పాస్‌పోర్ట్ దరఖాస్తుదారులకు హైదరాబాద్ రీజినల్ పాస్‌పోర్ట్ కార్యాలయం (ఆర్పీవో) శుభవార్త చెప్పింది. వేసవిలో పెరిగిన రద్దీని దృష్టిలో ఉంచుకుని, అపాయింట్‌మెంట్ల కోసం నిరీక్షణ సమయాన్ని తగ్గించేందుకు మే 9న ప్రత్యేకంగా "పాస్‌పోర్ట్ మేళా" నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈ మేళాలో భాగంగా నార్మల్ కేటగిరీ కింద 4,000 అదనపు అపాయింట్‌మెంట్ స్లాట్లను విడుదల చేస్తున్నట్లు హైదరాబాద్ ఆర్పీవో జె. స్నేహజ తెలిపారు. హైదరాబాద్ పరిధిలోని బేగంపేట, ఎంజీబీఎస్ మెట్రో, రాయదుర్గం పీఎస్‌కేలకు 3,100 స్లాట్లు, కరీంనగర్, నిజామాబాద్ పీఎస్‌కేలకు 900 స్లాట్లు కేటాయించారు. ఈ అదనపు స్లాట్లు తత్కాల్, పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికేట్ (పీసీసీ) సేవలకు వర్తించవని స్పష్టం చేశారు. ప్రస్తుతం 8 నుంచి 10 రోజులుగా ఉన్న అపాయింట్‌మెంట్ నిరీక్షణ కాలాన్ని 5 నుంచి 7 రోజులకు తగ్గించడమే ఈ మేళా ముఖ్య ఉద్దేశమని స్నేహజ వివరించారు. సేవల సామర్థ్యాన్ని పెంచడంలో భాగంగా, మే 4 నుంచి కరీంనగర్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రం (పీఎస్‌కే) రోజువారీ అపాయింట్‌మెంట్ల సామర్థ్యాన్ని 220 నుంచి 400కి పెంచుతున్నట్లు ఆమె తెలిపారు. దరఖాస్తుదారులు అధికారిక వెబ్‌సైట్ జ్ఞుఖ్ంంజాశీతీఅఅఎఖు.స్త్రశీజ.అఅ ద్వారా ఆన్‌లైన్‌లో స్లాట్లను బుక్ చేసుకోవాలని సూచించారు.

# బైక్ ట్యాక్సీలపై నిషేధాన్ని ఎత్తివేస్తూ హైకోర్టు తీర్పు

- వాహనం బైక్ అయినంత మాత్రాన పర్మిట్ నిరాకరించరాదన్న కోర్టు
- వ్యాపార స్వేచ్ఛ హక్కుకు ఇది విఘాతమన్న హైకోర్టు డివిజన్ బెంచ్
- దీనిని సవాలు చేస్తూ సుప్రీంకోర్టుకు కర్ణాటక ప్రభుత్వం
- ఓలా, ఉబెర్ వంటి అగ్రిగేటర్లకు వ్యతిరేకంగా పిటిషన్ దాఖలు




**బెంగుళూరు, ఏప్రిల్ 29 (నినాదం):** కర్ణాటకలో బైక్ ట్యాక్సీ సేవలపై వివాదం మరోసారి తీవ్రస్థాయికి చేరింది. ఈ సేవలపై విధించిన నిషేధాన్ని ఎత్తివేస్తూ ఇటీవల కర్ణాటక హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఏఎన్ఐ టెక్నాలజీస్, ఇతర క్యాబ్ అగ్రిగేటర్లకు వ్యతిరేకంగా గత వారం ఈ అప్పీల్ దాఖలు చేయగా త్వరలోనే ఇది విచారణకు రానుంది. ఓలా, ఉబెర్, ర్యాపిడో వంటి సంస్థలు దాఖలు చేసిన అప్పీళ్లపై విచారణ జరిపిన హైకోర్టు డివిజన్ బెంచ్.. కేవలం ద్విచక్ర వాహనం అయినందుకే పర్మిట్ నిరాకరించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. సమగ్ర నియంత్రణ విధానం లేనందున బైక్ ట్యాక్సీ సేవలను నిలిపివేయాలని గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఆదేశాలను ఈ ధర్మాసనం కొట్టివేసింది. మోటార్ వాహనాల చట్టం ప్రకారం మోటార్ సైకిళ్లు కూడా 'రవాణా వాహనాల' పరిధిలోకి వస్తాయని, వాటిని ట్యాక్సీలుగా పరిగణించకుండా మినహాయించలేరని ధర్మాసనం అభిప్రాయపడింది. బైక్ ట్యాక్సీలను నిషేధించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(g) ప్రకారం సంక్రమించిన వృత్తి, వ్యాపార స్వేచ్ఛ హక్కును హరించడమే అవుతుందని పేర్కొంది. అయితే, బైక్ ట్యాక్సీ కార్యకలాపాలను నియంత్రించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుందని, మోటార్ వాహనాల చట్టంలోని సెక్షన్ 74(2) కింద షరతులు విధించవచ్చని కోర్టు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, హైకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ కర్ణాటక ప్రభుత్వం సుప్రీంకోర్టులో న్యాయపోరాటానికి దిగింది.

## రాయ్‌పూర్-విశాఖ హైవే ప్రాజెక్టు

# అవినీతిపై ఈడీ దర్యాప్తు

- ఈడీ దాడుల్లో రూ.67 లక్షల నగదు, 37 కిలోల వెండి స్వాధీనం
- ఛత్తీస్‌గఢ్‌లో 8 చోట్ల సోదాలు, రూ.67 లక్షల నగదు స్వాధీనం
- 37 కిలోల వెండి కడ్డీలు, కీలక పత్రాలు సీజ్ చేసిన అధికారులు
- ప్రభుత్వ అధికారి నిర్భయ్ సాహు సహా పలువురిపై కేసు నమోదు




**రాయ్‌పూర్ ఏప్రిల్ 29 (నినాదం):** రాయ్‌పూర్-విశాఖపట్నం జాతీయ రహదారి ప్రాజెక్టుకు సంబంధించిన అవినీతి కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తును ముమ్మరం చేసింది. భారత్‌మాల పథకంలో భాగమైన ఈ ప్రాజెక్టు భూసేకరణలో జరిగిన అక్రమాలపై ఛత్తీస్‌గఢ్‌లోని పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. ఈ తనిఖీల్లో భారీగా నగదు, వెండిని స్వాధీనం చేసుకుంది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (PMLA) కింద రాయ్‌పూర్, అభన్‌పూర్, ధమ్‌తరి సహా 8 ప్రాంతాల్లో ఈ సోదాలు జరిగాయి. ఈ తనిఖీల్లో రూ.66.9 లక్షల నగదు, 37.13 కిలోల వెండి కడ్డీలు, ఇతర వెండి వస్తువులను అధికారులు సీజ్ చేశారు. వీటితో పాటు పలు డిజిటల్ పరికరాలు, కీలక పత్రాలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఏప్రిల్ 28న ఈడీ ఒక ప్రకటనలో తెలిపింది. అభన్‌పూర్ సబ్-డివిజనల్ అధికారిగా పనిచేసిన నిర్భయ్ సాహుతో పాటు మరికొందరిపై ఛత్తీస్‌గఢ్ ఏసీబీ, ఆర్థిక నేరాల విభాగం నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ ఈ కేసును విచారిస్తోంది. కొందరు ప్రభుత్వ అధికారులతో కుమ్మక్కై, భూ రికార్డులను తారుమారు చేసి అక్రమంగా పరిహారం పొందారని ప్రధాన ఆరోపణగా ఉంది. జాతీయ రహదారుల చట్టం ప్రకారం భూసేకరణ నోటిఫికేషన్ జారీ అయిన తర్వాత కూడా భూ యాజమాన్య హక్కులను బదిలీ చేసి, చిన్న చిన్న ప్లాట్లుగా మార్చి ఎక్కువ పరిహారం పొందినట్లు దర్యాప్తులో తేలిందని ఈడీ పేర్కొంది. ఈ విధంగా పొందిన అదనపు పరిహారమే నేరపూరిత ఆదాయమని, దీనివల్ల ప్రభుత్వానికి నష్టం వాటిల్లిందని ఏజెన్సీ స్పష్టం చేసింది. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోందని, మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# సంక్షోభంలో శ్రీలంక క్రికెట్..

## అధ్యక్షుడితో సహా బోర్డు మొత్తం రాజీనామా

- శ్రీలంక క్రికెట్ బోర్డు అధ్యక్ష పదవికి షమ్మీ సిల్వా రాజీనామా
- ఆయనతో పాటు ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు కూడా వైదొలిగిన వైనం
- జట్టు వైఫల్యాలు, అవకతవకల ఆరోపణలే రాజీనామాలకు కారణం
- గతంలోనూ బోర్డుపై సస్పెన్షన్ వేటు వేసిన ఐసీసీ




**కొలంబో, ఏప్రిల్ 29 (నినాదం) :** శ్రీలంక క్రికెట్ (ఎస్ఎల్‌సీ) తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. బోర్డు అధ్యక్షుడు షమ్మీ సిల్వా తన పదవికి రాజీనామా చేశారు. ఆయనతో పాటు శ్రీలంక క్రికెట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు కూడా తమ పదవుల నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించారు. తమ రాజీనామా లేఖలను శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే, క్రీడల శాఖ మంత్రి సునీల్ కుమార గమాగేలకు పంపినట్లు శ్రీలంక క్రికెట్ బోర్డు బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. జాతీయ జట్టు వరుస వైఫల్యాలు, బోర్డులో అవకతవకలు జరుగుతున్నాయనే ఆరోపణల నేపథ్యంలో షమ్మీ సిల్వాపై తీవ్ర ఒత్తిడి పెరిగింది. ఇటీవల భారత్‌తో కలిసి సంయుక్తంగా నిర్వహించిన టీ20 ప్రపంచకప్‌లో శ్రీలంక జట్టు కనీసం సూపర్-8 దశకు కూడా చేరుకోలేకపోయింది. ఈ పేలవ ప్రదర్శన రాజీనామాలకు తక్షణ కారణంగా తెలుస్తోంది. 65 ఏళ్ల షమ్మీ సిల్వా 2019 నుంచి శ్రీలంక క్రికెట్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. 2021, 2023, 2025 సంవత్సరాల్లో ఆయన ఏకగ్రీవంగా తిరిగి ఎన్నికయ్యారు. 2025లో జై షా తర్వాత ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) అధ్యక్షుడిగానూ సిల్వా బాధ్యతలు చేపట్టారు. షమ్మీ సిల్వా హయాంలో శ్రీలంక క్రికెట్ బోర్డు వివాదాల్లో చిక్కుకోవడం ఇది తొలిసారి కాదు. 2023 వన్డే ప్రపంచకప్‌లో జట్టు దారుణంగా విఫలం కావడంతో అప్పటి క్రీడల మంత్రి బోర్డును రద్దు చేశారు. ఇది అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) నిబంధనలకు విరుద్ధం కావడంతో, శ్రీలంక క్రికెట్ బోర్డు సభ్యత్వాన్ని ఐసీసీ తాత్కాలికంగా రద్దు చేసింది. దీని ఫలితంగా శ్రీలంకలో జరగాల్సిన అండర్-19 ప్రపంచకప్‌ను దక్షిణాఫ్రికాకు తరలించారు. ఆ తర్వాత 2025లో సిల్వా తిరిగి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినా, తాజా పరిణామాలతో ఆయన ఏడేళ్ల పాలన ముగిసినట్లయింది. శ్రీలంక 1973 క్రీడా చట్టం ప్రకారం క్రీడా సమాఖ్యలను రద్దు చేసే అధికారం మంత్రికి ఉన్నప్పటికీ, ఎన్నికైన సంస్థలలో ప్రభుత్వ జోక్యాన్ని ఐసీసీ అంగీకరించదు. ప్రస్తుత పరిణామాలపై ఐసీసీకి సమాచారం అందించినట్లు తెలుస్తోంది. అయితే, కొత్త ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు.